# గాలిలో ఓ క్షణం

నవల

- గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ మనోగతాల్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 162

కౌముది మాసపత్రికలో

నవంబర్ 2015 సంచిక నుంచి మే 2016 సంచిక వరకూ వచ్చిన

సీరియల్

# (ప్రారంభం)

**నాగావళి నది** వంతెనమీదకి వచ్చేవరకూ నాకు వంట్లో ప్రాణం లేదు.

నా మనస్సులాగే వేడెక్కిన ఇంజన్‌ను ఆపి వెనక్కి తిరిగి, భయంతో ఉక్కిరిబిక్కిరవుతున్న నన్ను చూసి రాయలు ఒకటేనవ్వు.

రాయలుని చూస్తే చీకటి గుర్తుకొస్తుంది. చీకట్లో ఒక క్షణం మెరిసి మాయమయే వెలుగుకిరణమంత స్వచ్ఛంగా నిండుగా నవ్వుతాడు.

మూడు గంటల భయానికీ, అలసటికీ, అతని నవ్వు జవాబు -

"బ్రతుకు కూడా ఇంత భయంకరమయినదీ - కష్టమయినదీనండీ - అందుకనే జాగ్రత్తగా బ్రతకదలచినవాడు ఒక్కసారయినా మోటార్ సైకిలు తొక్కాలంటాను." అంటున్నాడు రాయలు.

"నాకు వేరేపనివుంది. మీరు రిక్షా తీసుకు ఇంటికి వెళ్ళిపోండి. వీలయితే రాత్రి కలుస్తాను. లేకపోతే రేపు" - అన్నాడు.

నిర్లక్ష్యంగా అటూ ఇటూ కదుల్తూ మోటారు సైకిలు నడుపుకుపోతున్న రాయలును చూస్తూ జీవితాన్ని కూడా ఇంత నిర్లక్ష్యంగా గడిపేస్తాడా అనిపించింది.

నాకు రెండువేపులా నాగావళి నీరు - రక్తంతో వేడెక్కిన శరీరాన్ని పలకరిస్తూ సాయంకాలపు గాలి - ఆ పదిక్షణాల్లో రాయలుని గురించి రాస్తే బావుణ్ణనిపించింది.

కానీ మనస్సు చెప్పినపనులన్నీ చెయ్యడానికి కాలం, పరిస్థితులూ మొరాయిస్తాయి -

అందుకనే పది సంవత్సరాల తర్వాత సాధ్యపడింది ఆ పని.

## 2

రాయలు చచ్చిపోవడం చాలా విచిత్రంగా జరిగిందని రామకృష్ణ టెలిగ్రాం ఇస్తే చూసి ఆశ్చర్యపోలేదు నేను.

"అవును, అతను ఇలాగే చచ్చిపోతాడని తెలుసునాకు. అందుకే అతణ్ణి మరిచిపోవద్దని ఆ రోజు నీతో చెప్పాను" అని ఉత్తరం వ్రాశాను. కానీ ఆలోచిస్తున్న కొద్దీ ఇంకా చాలా విషయాలు గుర్తుకొస్తున్నాయి, ***అనుభవాలకంటే, అనుభవాల జ్ఞాపకాల ప్రభావం చాలా బలంగా ఉంటుందేమో మరి.***

రాయలు ఎవరని ఎవరన్నా అడిగితే చీకటి గుర్తుకొస్తుంది నాకు. చాలా సుళువుగా విడిపోయే సమస్యకంటే మెదడుకు పనిఇచ్చే సమస్య. అంటే గౌరవం, ఆసక్తీ ఉన్నట్టే అన్నీ స్పష్టంగా తెలిసే 'వెలుగు' కంటే చీకటి రేపే ప్రశ్నలో, ఆ సందిగ్ధం, సంశయంలో ఏదో ఆకర్షణ గోచరిస్తుంది నాకు. చీకటిలాంటి మనస్సూ, ఆశలూ, ఆశయాలు - ఇట్లా.

రాయలుని చూస్తే స్పష్టతలేని రంగుచిత్రం, తెరచాపజారిన ఓడకొయ్య గుర్తుకొస్తుంది. నవ్వితే వెన్నెల కురిసినట్టు అంతవరకూ మనలో మిగిలిన ప్రశ్నలన్నిటికీ ఆ నవ్వు జవాబులాగ, గొప్ప జీవితానికిస్తున్న హామీలాగా మాటలో విసురు. కొత్తగా పరిచయమయిన వ్యక్తి చెదిరి దూరంగా పోయేంత కరుకుదనం, విసురూ, కానీ కొంత భరించి, క్షమించగలిగితే అంత మంచి నేస్తం మరొకడు ఉండడు.

మనిషిలో చెప్పుకోదగ్గ ప్రత్యేకత ఏమీ ఉండదు. వెయ్యిమందిలో ఒకడు. ఓ చోట మాఘం అంటాడు - చిన్న కోనేటిలో ఓ గులకరాయి రేపిన తరంగాలంత స్వల్పవ్యవధి అతను ఎదుటి వ్యక్తిలో రేకెత్తించే ఉత్కర్ష - అని. అంతతో సరి. ఆ తర్వాత ప్రపంచంలో చాలా విషయాల్లాగే రాయలు కూడా మరుగునపడిపోతాడు.

మహాత్ముల్నీ, దేశోద్ధారకుల్ని మరచిపోవడానికి ప్రపంచం యుగయుగాలుగా చేస్తున్న ప్రయత్నాల్ని చరిత్ర నిరూపిస్తూనే ఉంది. గొప్ప భావాన్ని, గొప్ప సూత్రాన్ని, గొప్ప సిద్ధాంతాన్నీ నేర్పిన మహాత్ముల్ని ప్రపంచం క్షమించదు. ఆ గొప్పతనాన్ని వదులుకోడానికి, అంత తాము పెరగలేదన్న విషయాన్ని ఇతరుల నుంచి దాచుకోడానికి ప్రయత్నాలు జరుగుతాయి. అలా కాకపోతే గాంధీ, సోక్రటీసు, అబ్రహాంలింకన్, క్రీస్తు నూరేళ్ళు ఎందుకు బ్రతకలేదు?

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే నా కథానాయకుడు మహాత్ముడు కాదు. ప్రపంచానికి గొప్ప సిద్ధాంతాన్ని సమర్పించనూలేదు. అయినా నూరేళ్ళు బ్రతకలేకపోయాడు. అదే ఆశ్చర్యం.

## 3

పదేళ్ళ క్రిందటి ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం. రెండేళ్ళుగా నా అభిరుచులకి తగిన అమ్మాయికోసం వెదకి అలిసిపోయిన నన్ను, ఆనాటి మధ్యాహ్నం హఠాత్తుగా పలకరించడానికి వచ్చాడు రామకృష్ణ. "శ్రీకాకుళంలో ఒక అమ్మాయి ఉంది, వెళ్ళి చూస్తావా?" అన్నాడు. నేను జవాబు చెప్పడానికి అవకాశం ఇవ్వకుండా "నీలాగే అభిరుచుల పోరాటాన్ని ఇంట్లో సాగిస్తోందట, ఆ అమ్మాయి - వెళ్ళి చూసుకో నచ్చితే మంచి కట్నం కూడా ఇస్తారట" అని ఉన్న పాటున లేవదీశాడు.

"ఇప్పుడే?"

"అవును. ఇప్పుడే బయలుదేరాలి" అని కూచున్నాడు.

"రేపు మెయిలుకి కలకత్తా పోవాలి. శలవు అయిపోయింది" అన్నా.

క్షణం ఆలోచించి "అయితే శ్రీకాకుళం ఈ సాయంకాలం బయలుదేరే వ్యక్తి ఒకడున్నాడు" అని అన్నాడు.

దిగులుగా వాడితో నడిచాను.

"పోనీ ఈసారి వచ్చినపుడు ఆ అమ్మాయిని చూస్తే?" అన్నాను మధ్యలో.

"అలాకాదు. నిన్ను తీసుకువస్తానని వాళ్ళతో మాట ఇచ్చాను."

ఇంకేం మాట్లాడలేదు నేను.

మెయిన్ రోడ్డుమీద ఒక పక్కగా నిలబడ్డ రివటలాంటి వ్యక్తిదగ్గర ఆపాడు రామకృష్ణ. పక్కనే పాతకాలపు మోటారు సైకిలు.

మాట్లాడేముందు రోగిని డాక్టరులాగా ఆపాదమస్తకం పరీక్ష చేస్తున్నాడతడు. ఆ శరీరం నలుపుకు అర్థంలేదు. ఆశతో బరువెక్కిన కళ్ళలో నీడలూ, ఏవో కొండలోయల్లోని నిశ్శబ్దం, చీకటి రాత్రిలో ప్రళయం గుర్తుకొస్తుంది. కళ్ళను చూడాలని ఎందుకో అనిపించింది కానీ నల్లద్దాల కళ్ళజోడు మిగతా ముఖాన్ని, నుదుటిని వేరుచేసింది. చిన్న నుదురు.. చూసీచూడడంతో మెదడుతో హెచ్చుపనిచేసే వ్యక్తి కాదనిపిస్తుంది.

"ఇతను కృష్ణదేవరాయలు - మేమంతా రాయలు అంటాం - నా మిత్రుడు" అని రామకృష్ణ పరిచయం చేస్తే ఓసారి నావేపు ముఖం తిప్పినట్టు గుర్తు. అంతలో రామకృష్ణ వేపు తిరిగి "మన అవకాశాలన్నీ అరవవాళ్ళు కొట్టేస్తున్నారని ఏడుస్తారు. కానీ, కనీసం పనిలో వాళ్ళ సిన్సియార్టీని నేర్చుకోడానికి ఆంధ్రాస్‌కి మరికొన్ని సంవత్సరాలు పడుతుంది. నువ్వు రెండుగంటలకి వస్తానని చెప్పగానే నేననుకున్నాను, మూడుకయినా ఇక్కడికి చేరతావో లేదోనని - ఇప్పుడూ నాలుగు - త్వరగా సైకిలు ఎక్కు - పోదాం" అన్నాడు.

నేను తెల్లబోతుంటే రామకృష్ణ అతడు గమనించకుండా భుజం తట్టి "ఈ మాటలకు అలవాటుపడాలి. నువ్వు దేనికీ జవాబు చెప్పకు" అని మెల్లిగా గొణిగాడు.

"ఈయన నీతో వస్తారు. నేను మెయిల్‌లో రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటాను. కొంచెం అవసరమయిన పని ఉందక్కడ. అందుకని ఇట్లా ఏర్పాటు చేశాను" అన్నాడు.

అప్పుడు నావేపు సూటిగా చూసినట్టున్నాడు రాయలు. కళ్ళు ఇంకా గుర్తుతెలియడంలేదు. ఆపరేషన్ థియేటర్‌లో పేషెంటు బలహీనతమీద డాక్టరుకు వచ్చిన అనుమానం అతని నుదుట ముడుతల్లో కనిపించింది నాకు. మోటారు సైకిలు మీద ఇన్ని మైళ్ళ ప్రయాణానికి నేను సిద్ధపడగలనో లేదో అని చూస్తున్నాడు కాబోలు -

"అదేం లేదు - మంచి మిత్రుడేలే" అంటున్నాడు రామకృష్ణ. నాలో ఏది లేదని చెప్తున్నాడో అర్ధంకాక తెల్లబోయాను. దగ్గరికి వచ్చి ప్రశ్నకి తప్పు జవాబు చెప్పిన విద్యార్థిని ఉపాధ్యాయుడులాగా భుజం తట్టాడు రాయలు.

"దేశభక్తి గురించీ, ప్రజోద్ధరణగురించీ, ప్రేమగురించి నాతో మాట్లాడకండి. ఆ పని సాధ్యమయితే మీరు నా మోటారు సైకిలు మీద ప్రయాణం చెయ్యవచ్చు" అన్నాడు.

ఏసుక్రీస్తుని శిలువకు చేర్చినప్పటి నిస్సహాయత గుర్తుకొస్తోంది నాకు. చివరిసారిగా ఈ ప్రయాణం మానివేయడం సాధ్యమా అని రామకృష్ణవేపు చూశాను. కానీ సాధ్యమయేటట్టు లేదు. ఈ పాతసైకిలూ. ఆ క్షణంలో పరిచయమయిన వ్యక్తితో మూడుగంటల ప్రయాణం అరవైమైళ్ళ వేగంలో వెళ్తున్న కారును బ్రేకులుపడనప్పటి ఆందోళనలాగా ఉంది.

జీవితంలో అవాంఛితమైన వాటినన్నిటినీ ఇట్లాగే వదులుకోవడం సాధ్యపడదేమో - ఏమయినా ఆ క్షణాన్నీ రాయలుతో ప్రయాణం భయాన్నీ, విసుగుదలనూ కలిగించింది. నేనింకా ఏవో ఆలోచిస్తూ నిలబడితే "టైంలేదు. త్వరగా కూర్చోండి" అని పాతమోటారు సైకిలుని స్టార్టు చేశాడు.

"వాడు ఉత్తఫూల్ - ఆ విషయం గుర్తుంచుకో" అని చివరిసారిగా చెవిలో హెచ్చరించాడు రామకృష్ణ. పెద్ద వస్తాదు ముందు కుస్తీకి నిలబెట్టిన బలహీనుడి మనస్సులాగా, సైకిలు కుదుపులో ఊగిసలాడింది మనస్సు - "ఈ ప్రయాణం ఆపగలవేమో మరొక్కసారి ప్రయత్నించు" అన్నట్టుగా రామకృష్ణవేపు చూశాను. అది గ్రహించాడు వాడు. "పరవాలేదు బ్రదర్ - నిశ్శబ్దంగా మూడుగంటలు అంతే. శ్రీకాకుళం చేరుకుంటావ్" అన్నాడు.

పిరికివాడి గుండెలా గిజగిజలాడి ముందుకు దూసుకుపోయింది మోటార్ సైకిలు. అట్లాంటి ప్రయాణం నాకదే కొత్త. స్థిమితంగా సైకిలు నడపటమంటూ రాయలుకి తెలీదేమోననిపించింది. మనుషులందరిమధ్యనుంచీ ధాన్యం మధ్యనుంచీ అలవాటుపడ్డ పురుగుపాకినట్టు తప్పించుకుపోతున్నాడు. రోడ్డుమీద ఎత్తుపల్లాలన్నీ నా శరీరం మీద పనిచేస్తున్నాయి.

శిధిలావస్థలోనున్న ఆ వెనుక సీటు నా భద్రత మీద హామీ ఇవ్వడంలేదు. ఊరుదాటేసరికి పొత్తికడుపులో నొప్పి ప్రారంభమయింది. రోడ్డుమీద ఎత్తుపల్లాల్ని నిస్సహాయంగా చూస్తూ కూర్చున్నాను. ఎట్లా ఆయనతో మాట్లాడాలో నా బాధను వ్యక్తం చేయాలో అర్థంకాక బిగుసుకుపోయాను.

ఏటవాలుగా పడుతున్న ఎండ పెళ్ళుమని శరీరాన్ని మండిస్తోంది, ఊరు దాటాక మోటార్ సైకిలు వేగం ఎక్కువయింది. నేను అతని భుజం మీద చెయ్యి తీస్తుంటే "సీటుకు ఆనుకుని కూచోండి. క్రింద పడితే స్వేచ్ఛగా చచ్చిపోవడానికి కూడా అవకాశం ఉండదు" అన్నాడు. గుండె ఝల్లుమంది. ఏదో చెప్పాలనిపిస్తోంది. కానీ మాటలు రావు. స్తబ్దుడనయి చరమాన్ని ఊహించుకుని వణికేరోగి మంచాన్నిలాగ, ఆ సీటుని అంటిపెట్టుకు కూచున్నాను.

ఎవరన్నా మిత్రులు కనిపిస్తే అరవైమైళ్ళ వేగంతో పోయే సైకిలును హఠాత్తుగా ఆపుతాడు. నేను తృళ్ళిపడి ముందుకు జరిగితే - రోట్లో వేలుపెట్టుకున్న కుర్రాడిని మందలింపుగా చూసినట్టు చూస్తాడు వెనక్కి తిరిగి.

పొత్తికడుపులో నొప్పి రాను రాను భరించరానిదిగా తయారయింది. అంత నిస్సహాయంగా నాలోనేను ఎప్పుడూ ఏడవలేదు.

ఒక అరగంట ప్రయత్నంతో మొదటి వాక్యాన్ని కూడ దీసుకుని ఊరుచివర కొబ్బరితోట దాటే సమయంలో అన్నాను. "రాయలుగారూ! - ఇదే మొదటిసారి, ఇట్లాంటి ప్రయాణం చేయడం. నేను చాలా బలహీనుణ్ణి. "

నిశ్శబ్ధంగా ఉన్న తోటంతా ప్రతిధ్వనించేలాగ ఉప్పెనలా నవ్వాడు రాయలు ఆ మాటలకి. అతని నవ్వులో అందాన్ని, ఆకర్షణనీ అప్పుడు మొదటిసారిగా చూశాన్నేను. నా భయాన్ని క్షణంలో గ్రహించాడు.

"మీ భయం నాకర్ధమవుతోంది.. మీరు చచ్చిపోరు. ఆ హామీ మాత్రం ఇస్తున్నాను" అన్నాడు. అంతలో మళ్ళా వెనక్కి తలతిప్పి "నన్ను మీ తమ్ముణ్ణిగా భావించండి సార్, మీ తమ్ముడు మీకు కీడు తలపెట్టడుకదా - నేనూ అంతే" అన్నాడు. కానీ అతని మనస్సులో ఉన్న సౌమ్యత చేతల్లో, మాటల్లో కనిపించడంలేదు. ఇంకా అరవైమైళ్ళ వేగంలోనే శరీరాల్ని మోసుకుపోతోంది మోటార్ సైకిలు.

ఉన్నట్లుండి మళ్ళా అడిగాడు "చచ్చిపోవడం అంటే అర్ధం ఏమిటండీ?"

"**ఏ స్త్రీకీ ప్రేమించడం తెలీదు.** భారత స్త్రీకి 'ప్రేమ' అర్ధమే తెలీదు. అందుకని వాళ్ళు పిలుచుకునే ప్రేమ పోకుండా భక్తి, భగవంతుడు, సంప్రదాయాలు, పాతివ్రత్యం - అనే భటుల్ని నియమించుకుంటుంది. విదేశ యువతికి కనీసం 'ప్రేమ' అర్ధం తెలుసు. అది పూర్తిగా ఎవరితో ఉండదనీ, పూర్తి అనుభవం ఎవరికి సాధ్యం కాదని తెలుసు. అందుకని కోరికల సాఫల్యంతో, శరీర సుఖంతో సంతృప్తి పడుతుంది. సావిత్రినీ, సీతనీ ఫ్రాయిడ్ ముందు నిలబెట్టి ఉంటే వారి ప్రేమకి కొత్త అర్ధాలు చెప్పేవాడేమో! నేను ఫ్రాయిడ్ని చదువుకోలేదనుకోండి" అని గుక్కతిప్పుకోకుండా చెప్పాడు.

నాకు భయం వేసింది. "ఇట్లాంటి విషయాలు అందరితో చెప్తూ ఉంటారా?" అన్నాను. ఆ వాక్యాలలో ధ్వనిని రాయలు గ్రహించినట్టున్నాడు - గ్రహించి ఉప్పెనలాగ నవ్వాడు. "నన్నెవరూ ఇలాంటి ప్రశ్నలు అడగరండి. అందుకనే చెప్పే బాధ ఉండదు. నా చేతల్ని బట్టే నేనో పిచ్చి వెధవనని సగం ప్రపంచం నిర్ణయానికి వచ్చింది. నేనిలా మాట్లాడితే 'ఎంత పాడయాడో కదా?' అని జాలిపడతారు. ***ప్రపంచంలో మంత్రి కావడంలోనూ, కవిస్సామాట్ కావడంలోనూ సుఖం లేదండీ! పిచ్చివాడు, సర్కస్ బఫూన్ కావడంలో ఆనందం ఉంది. ఎందుకంటే వారి నెవరూ సీరియస్‌గా తీసుకోరు కనుక.***"

బ్రతుకు, సంప్రదాయం, భగవంతుడు, స్త్రీ ఇట్లాంటి విషయాల ప్రాథమిక సూత్రాలమీద బేధాభిప్రాయాల్ని ప్రకటించే వ్యక్తి ఆ సాయంకాలం నా మీద నమ్మకంతో ఒక్కొక్క విషయాన్నీ బయటపెట్టడం నన్నాశ్చర్య పరిచింది. నన్ను నమ్మకస్థుడిగా భావించినందుకు సంతోషమూ కలిగింది."

"మీరు చాలా విచిత్రమయిన వ్యక్తి" అన్నాను కాస్త ఆగి.

మళ్ళీ నవ్వాడు. "మొదట అంతా అలాగే అన్నారు మరి కాస్సేపు వింటే నేను పిచ్చివాడినని మీరూ నమ్ముతారు. అప్పటికి నాకు మీవల్ల కూడా ఏ భయమూ ఉండదు" అన్నాడు.

మనస్సు చివుక్కుమంది. "అలాక్కాదు. మీరు చెప్పేవన్నీ పూర్తిగా అసత్యాలు కావు. వాటిలో ఏవో రీజన్ కనిపిస్తోంది. ఒక్కసారి త్రోసిపారేయలేం. వాటి గురించి మళ్ళీ ఆలోచించే వ్యవధి కావాలి. ఒక్కటి మాత్రం చెప్పగల్ను. డబ్బు అందరికీ ఉంటుంది. కానీ ఈ

ఆత్మవిశ్వాసం, తెగింపు, జీవితం పట్ల నిర్లక్ష్యం (మంచిదో, కాదో అలా ఉంచండి) ఉండడం కష్టం" అన్నాను. మనస్ఫూర్తిగా భావించే ఆ మాటలు చెప్పాను. రాయలు చాలా సంతోషించాడు ఆ మాటలకి

"వండ్రఫుల్ - ఇన్నాళ్ళకి నా ఫిలాసఫీకి మంచి శ్రోతని ఎంచుకున్నాను" అన్నాడు.

రోడ్డు పల్లంగా, సూటిగా ఉంది. "మరి పావుగంటలో శ్రీకాకుళం. 80 మైళ్ళ వేగం చూస్తారూ? చాలా హాయిగా ఉంటుంది. నాలాగా తెగింపుతో బ్రతికేవాడి జీవితమంత హాయిగా. కాని అందులో చాలా రిస్కుకూడా ఉంది" అన్నాడు.

"వద్దు, నాకా వేగమూ వద్దు, జీవితమూ వద్దు. నేను తట్టుకోలేను" అన్నాను.

నవ్వి ఊరుకున్నాడు.

మరి పదినిముషాల్లో మేమిద్దరం నాగావళి నది వంతెనమీద ఉన్నాం.

## 4

***ప్రపంచంలో అంతా దేశాన్ని ఉద్ధరించడానికి పుట్టరు. దేశోద్ధరణ, త్యాగం ఇవన్నీ పెద్ద వ్యసనాలు పొగ్రతాగడం, జూదంలాగే. వీటిని వదులుకోలేని వాళ్ళే ముందుకు వస్తారు. నిజానికి జీవించడమే ఓ పెద్ద వ్యసనం. అందుకనే ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని ఆశాభంగాలు కలుగుతున్నా బ్రతకడానికి చివరి ప్రయత్నాన్ని చేస్తూనే ఉంటాం -***

అని ధైర్యంతో, నిభాతో అనగల వ్యక్తిని మరిచిపోలేకపోయాను.

"ఎలా గడిచింది వాడితో?" అనడిగాడు రామకృష్ణ.

"చాలా విచిత్రమయిన వ్యక్తి రాయలు. నువ్వు అతని గురించి ఆ మాత్రం కూడా చెప్పి ఉండకపోతే ఇంకా బాగుండేది" అన్నాడు.

"పోనీలే, నిన్ను బాధపెట్టలేదు. వాడు ఉత్త బ్రూట్. ఏం మాట్లాడుతాడో అని భయపడ్డాను" అనేశాడు.

నా పని అయిపోయాక మెయిల్ ఎక్కుతూ రాయలు కనిపిస్తాడేమోనని ఎదురుచూశాను. కానీ కనిపించలేదు. వచ్చే సూచన ఎక్కడా లేదు.

"ఎవరు గురించి?" అనడిగాడు రామకృష్ణ.

"రాయలు కనిపిస్తాడేమోనని?"

వాడు ఒకటే నవ్వు. "నీకింకా పిచ్చి ఈ పాటికే నిన్ను మరిచిపోయి ఉంటాడు. రేపు అడిగితే నీ పేరుకూడా గుర్తుండదు"

బాధపడ్డాను. గతాన్ని పూర్తిగా మరిచిపోయే తీరు రాయలు మాటల్లో బాగుంది. కానీ చేతల్లో ఇట్లా సాధ్యమయి, ఇంత బాధాకరమయితే మంచిది కాదేమోననిపించింది. రాయలు చెప్పిన మిగతా సిద్ధాంతాలన్ని ఇట్లాంటివేనేమో. వాటిపై ప్రయోగానికి ఒక ప్రత్యేకమైన వాతావరణం కావాలి. అంతవరకూ నిజానిజాలు తేల్చి చెప్పడం కష్టం.

రైలు కదలబోతూంటే రామకృష్ణ చెవిలో మెల్లిగా అన్నాను. "రాయలు గురించి నాకు అప్పుడప్పుడు వ్రాస్తూ ఉండు. ఎప్పుడో ఒకప్పుడు రాయలు చచ్చిపోతే నాకా విషయం తప్పకుండా తెలియచెయ్యాలి" అన్నాను.

మొదట తెల్లబోయి చూసి ఫక్కున నవ్వేశాడు రామకృష్ణ. "భలే! ఆ జంతువు నిన్నాకర్షించింది చివరికి. తన భక్తుడు ఒకడున్నట్టు వాడికి చెప్తాలే. వాడిప్పుడప్పుడే చావడు. చస్తే ఆ కథంతా వ్రాస్తాను" అన్నాడు.

దూరం నుంచి ఇంకా రామకృష్ణ చెయ్యిగుర్తు తెలుస్తోంది. మేము నిన్న ప్రయాణం చేసి వచ్చిన రోడ్డు రైలుతో పోటీ పడలేక వెనక్కి పాకుతోంది. జీవితంలో జ్ఞాపకాలన్నీ ఇలాగే వెనక్కి పోతాయి గావును.

మరి ఆరునెలలకి శ్రీకాకుళం అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాను - నీరజ.

***వివాహం అంటే మరేమీకాదు. యౌవనం రేపే కోర్కెల ఉపశమనానికి పురుషుడు వివాహానికి అంగీకరిస్తాడు. స్త్రీ అట్లాకాదు. భవిష్యత్తులో సంసారం, బాధ్యతల బరువులో సుఖానికి మొగుణ్ణి అంగీకరిస్తుంది. కానీ ఆశించేదానికన్నా చెల్లించే ఖర్చు చాలా ఎక్కువయి ఇద్దరూ ఆశాభంగం చెందుతారు.***

వివాహానికి ఉత్తరం రాస్తే పెళ్ళయిన మూడు నెలలకి గుల్బర్గానుంచి ఉత్తరం రాశాడు రాయలు. "మోటార్ సైకిలు తయారీని ఇక్కడ నేర్చుకుంటున్నాను. మీ పెళ్ళికి వార్త ఆలశ్యంగా అందింది. ముందే తెలిసి ఉంటే వివాహం అంత అనవసరమయిన కార్యక్రమం జీవితంలో మరొకటిలేదని నిరూపించేవాణ్ణి. కానీ ఇప్పుడిక చేసేదేమీలేదు. పిల్లల్ని కని, దేశాన్ని ఉద్ధరించండి"

నవ్వుకున్నాను. రామకృష్ణకి ఉత్తరం చూపిస్తే విసుక్కుని "ఒట్టి పశువు! మంచీ చెడూ తెలీదు వెధవకి" అన్నాడు.

నలుగురూ అంగీకరించేదాన్ని ఆమోదించడం మంచితనం, అనుసరించడం సంస్కారమే అయితే రాయలు మంచివాడూకాదు. సంస్కారమే అయితే రాయలు మంచివాడూ కాదు  సంస్కారి కాదు. కానీ అటువంటి మంచితనం, సంస్కారం ఎందరు భరించగలరన్నది ప్రశ్న. అటువంటి మంచి ఉండనక్కరలేదు. ఉన్నట్టు కనిపిస్తే చాలు ప్రపంచానికి. చెడుకూ, విప్లవానికీ ఇప్పట్లో అర్థం ఒకటే. గొప్ప విప్లవాన్ని సాధించడమంటే అర్థం చెప్పడం చాలా సులువు. ***సాధారణంగా రహస్యంగా చేయడానికి భయపడే పనిని బహిరంగంగా చెయ్యడానికి ప్రయత్నం, చేసే చేవ - అదే విప్లవం.***

ఇంకా రాయలు మీద గౌరవం పోలేదు. అతని నిర్లక్ష్యంలో ధైర్యంలో జీవితం మీద విసుగులో సుఖానికి అన్వేషణలో ఒక మార్గమంటూ కనిపిస్తూ ఎప్పటికప్పుడు నా కళ్ళను మిరుమిట్లు గొలిపిస్తోంది. ఆ విషయమే రామకృష్ణ అంటే "నీదంతా పిచ్చి. ఆ వెధవ గురించి ఆలోచించి తల పాడుచేసుకోకు" అన్నాడు.

ఇక మాట్లాడలేదు.

***చాలా విచిత్రమయింది మనస్సు. చెట్టునుంచీ పువ్వు వేరుకాగానే ఒక్కసారి చెట్టంతా రెపరెపలాడుతుంది. పువ్వును వదులుకునే విరహానికి తపన పడుతుంది గావును. అంతలో పువ్వు తెగిన చోట నీరు నిండుతుంది. కానీ కాలం ఆ బాధనీ పూడ్చిపెడుతుంది. మరికొంతసేపటికి ఆ పువ్వు జ్ఞాపకం కూడా మరిచిపోయినంత నిశ్చలమయి పోతుంది. అంతే మనస్సుకూడా.***

***అనుభవాలకి చలించి, ఆ క్షణానికి రెపరెపలాడి, వణికి, అంతలో కన్నీళ్ళు కార్చి మరిచిపోతుంది. మరిచిపోయే గొప్పగుణానికి కాకపోతే ఆ నరాల, కండరాల మధ్యలో ఆ విచిత్రమయిన ఆ అవయవాలకి అర్థం లేకపోదు.***

మొదటి రోజుల్లో ఎప్పుడన్నా మనస్సుకి అలసట కలిగించే పని తటస్థపడితే, ధైర్యం చాలక తడబడితే, చీకటిలో నడిస్తే, వింతగా మాట్లాడేవాళ్ళని చూస్తే - రాయలు గుర్తుకొచ్చేవాడు. అప్పటి నా ప్రయాణం, మాటలూ, ఆ నవ్వూ -

మరి దూరం పోవడం వల్ల అత్తవారింటికి వెళ్ళే అవకాశం పడలేదు. నాలుగేళ్ళ తరువాత మళ్ళీ ఆ దోమల మధ్యకి, ఆ నాగావళి నదీ తీరానికి వచ్చాను. బంధువుల కంటే రాయలుని చూడాలన్న ఆతృత, ఈ నాలుగేళ్ళ రాయలుని ఎట్లా, ఎంతగా మార్చి ఉంటాయన్న జిజ్ఞాస హేతువాదానికి ఏ ఆలోచనలలోనూ పొత్తుకుదరడం లేదు.

ఆవేశం, ప్రేమ, ఆత్రుత - ఇవన్నీ ఏ విషయంలోనూ రీజన్‌కు రానివ్వవు.

దట్టంగా పెరిగిన క్రోటన్స్ మొక్కల మధ్య ఉన్న నీలపు మేడని ఎవరో రాయలు ఇల్లని చూపితే అటువేపు నడిచాను. బంగళా చుట్టూ మొక్కలు. ఒక్క పోర్టికో మాత్రం కనిపిస్తోంది. మిగతా ప్రాంతమంతా మొక్కలు క్రోటన్స్, ఫెర్న్, జినియా, డిసెంబర్, బోగన్‌విల్లా అన్నీను. ఎక్కడా మార్గం కనిపించదు. ఒక మూల మాత్రం కాలినడకకు సరిపోయినంత సన్నటి ఆ త్రోవ. ఆ త్రోవ చివరి వరకూ చిన్న ఎర్రటి దీపాలు వెలుగుతున్నాయి. కుడివేపు నల్లటికారు ఆగివుంది.

లోపల ఎవరో సారంగి వాయిస్తున్నట్టున్నారు - లేక అది రేడియో స్వరమో అర్ధం కావడంలేదు. మెల్లగా సన్నటి త్రోవనుంచి ఆకుల మధ్యనుంచి తప్పించుకుంటూ వస్తున్నాను.

ఇంతలో పక్కనుంచి ఎవరో అరిచారు. మరుక్షణంలో పక్కనే ఉన్న చెట్టునిండా పువ్వులు పూసినట్టు చిన్న చిన్న దీపాలు వెలిగాయి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇటు చూస్తే రాయలు, మరి ఇద్దరు కూర్చుని మాట్లాడుతున్నారు.

రాయలును ఆత్రుతతో పరికించాను. ఇదివరకు కంటే కాస్త చిక్కిపోయినట్టున్నాడు. కానీ ఆ నల్లటి ముఖంలో నీరసం - అనుభవాల అలసటో, వయస్సులోని మార్పో తెలియటంలేదు చిన్నపిల్లలు ఆడుకునే గుర్రం మీద మెత్తటి పరుపు వేయించుకు కూర్చున్నాడు. అతనివేపు చూస్తూ అక్కడ కూర్చున్న ఇద్దరూ ఏదో మాట్లాడుతున్నారు.

నన్ను చూసి గుర్తు చేసుకోడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తున్నట్టున్నాడు. నుదురు ముడుతలుపడి, కళ్ళు మూసినప్పుడు ఎవరో పెద్ద వేదాంతిని చూస్తున్నట్లనిపించదు చాలా చిన్న కుర్రాడు లెక్కకి సమాధానం ఆలోచించినప్పటి జిజ్ఞాస, ఆత్రుత మాత్రమే కనిపిస్తుంది ముఖంలో. అదే విచిత్రం.

"మిమ్మల్నెక్కడో చూశాను కానీ ఈ మనస్సులో గతం అంతా బూజు పట్టిపోయింది" అన్నాడు.

నేను నవ్వాను. నాగావళి వరకూ మోటార్ సైకిల్ ప్రయాణం గుర్తుచేస్తే ఇల్లంతా ప్రతిధ్వనించేలాగా పగలబడి నవ్వాడు. కానీ గుర్రం మీంచి లేవలేదు. లేస్తే 'రాయలు' ఎందుకవుతాడు? ఒక్క చెయ్యిని మాత్రం ఆప్యాయంగా అందించి, దగ్గిర ఉన్న కుర్చీ చూపాడు. "అవును గుర్తుంది నాకు. ఈ నాలుగేళ్ళల్లో మళ్ళా అట్లా నా ఉపన్యాసాల్ని వినే వ్యక్తి కనిపించలేదు. అందుకే మీరు గుర్తుండిపోయారు. ఆ రోజు బాగా గుర్తు నాకు. చచ్చిపోతే ఎలా? అని మీరు, చచ్చిపోతే ఏం? అని నా వాదం. ఆ రోజు బాగా గడిచింది" - మళ్ళా నవ్వుతున్నాడు.

కూర్చున్న వ్యక్తులు ఏమనుకుంటున్నారో అని తలెత్తాను. కానీ వాళ్ళు ఇతనికి అలవాటు పడ్డట్టున్నారు. చీకట్లోకి కూర్చున్నారు.

"నేను మాట్లాడుకునే వ్యక్తి దొరికాడు. ఇక మీరు వెళ్ళిపోండి. నేను రాజకీయ నాయకుణ్ణి మాత్రం కాలేను. వాళ్ళని తిట్టడానికి - మరీ సరదా పుట్టినప్పుడు వాళ్ళని హత్య చెయ్యడానికి పుట్టాను నేను" అన్నాడు రాయలు వాళ్ళ వేపు తిరిగి.

ఏదో చెప్పడానికి ఆత్రుత వాళ్ళ ముఖంలో తెలుస్తోంది. కానీ నేనున్నానని ఆగిపోయినట్టున్నారు.

వెళ్ళిపోయాక పక్కనే ఉన్న సీసాతీసి గ్లాసులో పోసుకున్నాడు. ఒక్కసారి బీర్ వాసన గుప్పుమంది. నేను తెల్లబోవటం చూసి నవ్వాడు.

"ఎప్పుడూ 'ఉత్సాహాన్ని' ఇట్లా మోతాదులో తాగుతుంటానండి. ఎంత తాగినా నా తెలివితేటల్ని మాత్రం మింగేయను. ఒక్కసారి కన్నుమూస్తే ఈ బంగళా అంతా అమ్మేసేంత ప్రతిభావంతులు నౌకర్లూ, గుమాస్తాలూను -" అని గ్లాసుతో గడగడా త్రాగేశాడు.

అతను కూర్చున్న కర్రగుర్రాన్ని చూస్తున్నాను. తన యజమానిలో బాల్యాన్ని ఇదివరకటినుంచీ తెలిసినట్టు ముఖంలో నవ్వును, ఎవరో అందంగా దిద్దారు గుర్రం ముఖం మీద. నా దృష్టి గమనించి నవ్వాడు రాయలు.

"ఒక్కోసారి మనం పెద్దవాళ్ళమయామనీ, ఆలోచనను మరిచిపోవాలనిపిస్తుందండి. అయినా కుర్రాళ్ళం కాలేం. అందుకని ఇట్లాంటి నటనలు చేసి హ్యూమిలియేట్ అవుతుంటాను. నా చిన్నతనం త్వరగా గడిచిపోతుంది. మా నాన్న త్వరగా చచ్చిపోయి, నన్ను త్వరగా పెద్దవాణ్ణి చేశాడు -" పైప్ వెలిగిస్తున్నాడు.

చక్కటి నైట్‌క్వీన్ గాలి చెట్ల మధ్య నుంచి వస్తోంది. 'సంతోషం' అనే అరలో మనిషిని బిగిస్తే ఇట్లాగ, ఇక్కడే ఉంటాడనిపించింది. అయితే అది సంతోషం అరో, తృప్తి అరో ఇంకా తేలలేదు.

"ఈ నైట్ క్వీన్ వాసన బాగుందా? - మల్లెపువ్వు, సంపంగె, మొగలి వాసన ఏదైనా రుచిచూస్తారా?" అంటున్నాడు రాయలు.

"అదేమిటి?" అన్నాను.

***"ఈ జీవితంలో మనకు కావలసింది ఏదీ దొరకదు. దొరకని మ్యాజిక్‌ని సృష్టిలో చేసి, దొరికించుకోవాలనే జిజ్ఞాసను మానవుడిలో మిగిల్చి, సృష్టిని ఒక క్యూరియస్ ఎలిమెంటుగా తయారు చేశాడు దేవుడు. కానీ కావాలనుకున్న వన్నీ దొరికే స్థితివచ్చినప్పుడు ఇక జీవితంలో అందం ఉండదు.*** ఉదాహరణకి నన్ను తీసుకోండి. నాకు కావలసిందేదీ దొరకకుండా పోదు. ఈ మిషన్ లండన్ నుంచి తెప్పించాను. పన్నెండువేలు దీని ఖరీదు. మీట నొక్కితే ఇష్టం వచ్చిన సువాసన మిమ్మల్ని పలకరిస్తుంది. ఇదిగో - ఇప్పుడు మల్లెపువ్వుల మత్తుని అనుభవించుదాం" అని పక్కనే ఉన్న స్విచ్ బోర్డులో ఒక మీటను నొక్కాడు.

నిజమే నైట్‌క్వీన్ బలహీనపు వాసనల మూర్ఛ నుండి, క్రమంగా మల్లెపువ్వుల మత్తు లేచింది - జీవితపు రొటీనులో కొట్టుకుపోతున్న సామాన్య మానవుల మధ్య మహాపురుషుని సువార్త కనువిప్పులాగ, ఈ పల్చటి నైట్‌క్వీన్ వాసనల్ని అధిగమిస్తూ మల్లెలు వెయ్యి మల్లెలు కుప్పలు పోసినట్టు హృదయంలో బయటా రెక్కలు విచ్చుకుంటూన్న కోర్కెలలాగా మల్లెలు మల్లెలు.

"రాయలుగారూ - మీరు చాలా అదృష్టవంతులు" అన్నా కళ్ళు మూసుకుంటూ.

పక్కున నవ్వుకున్నాడు రాయలు. "అదే చెప్తున్నాను. నేను అదృష్టవంతుడిని కాదని. ***మనకు కావలసిందంతా దొరకడంలో అదృష్టం కాదు. మనకు కావలసిన దానికి చేసే ప్రయత్నంలో, అది దొరకకపోవడంలో అదృష్టం ఉంది."***

ఇప్పుడు నిర్భయంగా రాయలు పిచ్చివాడేననుకున్నాను. స్వర్గానికి తీసుకువచ్చి ఊర్వశిని ఎదురుగా నిలిపితే "నువ్వు వద్దు - నీ గురించి నే కలలోనే సుఖం నాకు" అంటాడా ఎవరన్నా?

చెట్ల మధ్య మల్లెపువ్వుల మత్తు గిలగిలా కొట్టుకుంటోంది. మమ్మల్ని కదలకుండా మా వంటి చుట్టూ తిరుగుతోంది. కళ్ళల్లో, నోటిలో, మెదడులో, ముక్కులో, హృదయంలోకి ప్రతి రక్తనాళంలోనికి ఆ సువాసన ప్రవేశించింది.

"ఇంత దట్టంగా చెట్లు పెంచారేం?" అని అడిగాను.

"నా దగ్గరకు వచ్చిన వాడు ఈ సుఖం అంతా చూసి 'ఇదే జీవితానికి పరాకాష్ఠ' అని మోసపోవడమో, ఇంతేనా జీవితమనుకుని విసుక్కోవడమో జరుగుతుంది. కానీ చూశారా? నా బంగళా జీవితానికి సరైన నిర్వచనం. దూరాన ఆకుల మధ్య, దట్టమైన చెట్ల అవతల సన్నటి వెలుగులో నీలిమేడ కనిపిస్తోంది. దానిని భగవంతుడనో, సుఖమనో, స్వర్గమనో అందాం. కానీ దాని దగ్గరకి చేరాలంటే ఎర్రటి దీపాల వెలుగులో ఈ సన్నటి దారివెంట నడవడమే గత్యంతరం. రెండోపక్కన జీవితంలో అనుమానాలు, భయాలు, కష్టాలంత దట్టమైన చెట్లు. కొంతదూరం ధైర్యంతో నడిస్తే హఠాత్తుగా కోరికల దీపాలు వెలుగుతాయి. ఈ చెట్టుకి వెలిగిన దీపాలలాగా మీ జీవితమంతా వాటి కాంతి ప్రసురిస్తుంది. వాటిమూర్ఛలో పడి ఆగిపోయారా (ఇప్పుడు మీరు ఆగిపోయినట్టు) ఆ నీలిమేడ విషయం మరిచిపోతారు. ఈ సువాసనలో, వెలుగు మత్తులో పడిపోతారు. కానీ విచిత్రమేమిటంటే కొంతసేపటికి ఈ మత్తుకూడా మొహం

మొత్తుతుంది. అప్పుడిక పోదామంటే మీకు దారితోచదు. తిరిగి వెనక్కిపోవడమే మార్గం ఇటువంటి సమయంలో ఏ 'రాయలు వంటి తాత్వికుడో, వేదంతో కనిపిస్తే ఆ నీలి మేడకి దారి దొరుకుతుంది'' అంటూ, నేను తెల్లబోతే, నవ్వడం ప్రారంభించాడు.

రాయలు వెనక నడుస్తున్నాను. అప్పుడతను మోటార్ సైకిల్ మీద ఉండటమే చూశాను కాని, అప్పుడు నడక చూడలేదు. కానీ ఇప్పుడు చూస్తే చాలా విచిత్రంగా కనిపించింది. తన నీడలో వెయ్యిమందికి ఆశ్రయం ఇస్తున్న ఠీవిలో నడుస్తున్నాడు ప్రక్కలకి ఊగుతూ ఈ నాలుగేళ్ళలో ఏమైనా మారాడా అని చూశాను. కానీ ఏమీ మార్పులేదు. అప్పటి మాటలలో ఇంకా నిర్లక్ష్యం యౌవన ఉద్రేకంతో కూడిన విసురూ కనిపించేది. కానీ ఇప్పుడు మరీ రూఢిగా, ఏదో బరువుతో చెపుతున్నట్టు, చాలా అనుభవాలను సమీకరించినట్టు చెపుతున్నాడు. ఉద్రేకంతో, నిర్లక్ష్యంతో ఉక్కిరి బిక్కిరయే రాయలు రెండేళ్ళ క్రిందటి వ్యక్తి. ఈ రాయలులో కాస్త చిరునవ్వు, స్థిమితం, ఏదో పెద్ద సిద్ధాంతాన్ని సిద్ధం చేసినప్పటి వేదాంతం.

''నేనేమైనా మారానా?'' అని అడుగుతున్నాడు వెనక్కి తిరగకుండానే.

ఏం చెప్పాలా అని మాటల్ని కూడదీసుకున్నాను. నేను సమాధానం చెప్పడం ఆలశ్యమయితే పక్కున నవ్వి ఆ సన్నటి దారికి అడ్డంగా నిలబడి ఇటు తిరిగాడు.

''మీరు కవులని మీరు వెళ్ళాక నాకు తెలిసిపోయిందిలెండి. నా నవ్వులో ఈ నాలుగేళ్ళ జీవితాన్ని ఊహించబోతున్నట్టున్నారు. కానీ మీరు తప్పక తప్పటడుగు వేస్తారు. రహస్యాల్ని అంత సుళువుగా బయటపెట్టని గర్వం ఒకటి నన్నిన్నాళ్ళు బ్రతకనిస్తోంది -''

''మీ కసలు రహస్యాలే ఉండవనుకున్నాను. ఎందుకంటే వాటిని దాచుకోవాలన్న కాస్త ప్రయత్నాన్నీ అలసటనీ మీరు భరించరని నా ఊహ'' అంటే తుళ్ళిపడి ఆగాడు. అతని ముఖం నల్లబడడం ఎర్రటి దీపాలు దాచలేకపోయాయి. కాస్త ఆగి, ''అవును ఏ రహస్యాలూ ఈ జీవితానికి అక్కరలేదనుకున్నాను. హఠాత్తుగా కొన్నిపోగయేసరికి తడబడ్డాను. మీకో విచిత్రం చెప్పేదా? నా మనస్సుకూడా క్రమంగా ఆలోచించటం అలవాటు చేసుకుంది'' నవ్వేడు.

నీలిమేడ మెట్లమీద పెద్ద కుక్క ఒకటి అతని కోసం ఎదురు చూస్తున్నట్టు కూర్చుంది. మరీ కళ్ళు మిరుమిట్లు గొలపని నీలిరంగు దీపాలు. చిన్న చిన్నవి. బంగళా ఆర్చిల నిండా వెలిగించారు. నీలిరంగు మధ్య బోగన్‌విల్లా ఎరుపు ఎలాగంటే నిరాశావాది జీవితంలో ఆశల చిహ్నాల్లాగా.

మధ్య పెద్ద హాలు - అక్కడే పెద్ద సోఫాసెట్టు, కొద్ది పుస్తకాలు మాత్రం ఉన్న బీరువా ఓ పక్క విశాలంగా ఉన్న మంచం, మరొక పక్క కోటు హేంగర్స్, వెనకకి ఒరిగి పడుకునే ఏర్పాటున్న కుర్చీ, చుట్టూ గోడలకి అందమైన ప్రకృతి చిత్రాలు. అప్పటికి అర్ధమయింది రాయలులో ఒక చిత్రకారుడు, ఒక కవి, ఒక వేదాంతీ, ఒక మెటీరియలిస్టూ ఉన్నారని. హాలు మధ్యకి వచ్చి షాండిలీర్ కిందకి దించి కొవ్వొత్తికి సిగార్ వెలిగించాడు. దానిని మళ్ళీ మీదికి త్రోసి ప్రపంచాన్ని శాసించే శాసనాధికారిలాగా చేతులు నడుం మీద ఆనించి ఆ గది మధ్య నిలబడ్డాడు.

''ఇది మన జీవితానికి ప్రతిబింబం'' అన్నాడు కళ్ళతో హాలుని పరిచయం చేస్తూ.

ఇంకా వింతగా చూస్తున్నాను.

''వివరిస్తాను చూడండి. ప్రపంచానికి సంబంధించిన వ్యాపారి, మూర్ఖుడో, పిచ్చివాడో అయిన రాయలు హాలుమధ్య కుర్చీలో పడుకొని ఉండగా - ఈ మూల లైబ్రరీ దగ్గర కవి అయిన రాయలు పరిశోధనలు చేస్తుంటాడు. వేదాంతి అయిన రాయలు ఆ కిటికీ దగ్గర కూర్చొని ఎనలైజ్ చేస్తుంటాడు. చిత్రకారుడు అయిన రాయలు ఈ చిత్రాలలో మంచిచెడ్డల్ని బేరీజు వేస్తుంటాడు, సుఖం - బద్ధకం - నిద్రలను ప్రేమించే రాయలు ఆ మంచం మీద మంచిజీవితం గురించి కలలు కంటూంటాడు.- ''

హాలుమధ్య రాయలు నవ్వితే గోడవరకు విసురుగా పోయిన శబ్దం పగిలి, ఏవో గంటలు మ్రోగించినట్టు శబ్దం వినిపించింది. ప్రతిధ్వనిలో ఎంతో సంగీతం స్త్రీ చిరునవ్వులోంచి అందం పుట్టినట్టు.

నేనింకా ఆశ్చర్యపోతూంటే నవ్వాడు. "ఇది స్వర్గం అని చెప్పానుగా. ఇక్కడ ఏది కదిపినా, సుఖం గురించీ అందం గురించీ సంతోషం గురించీ మాట్లాడుతుంది. ఈ గోడల రాయి రెండు దేశాల చివరినుంచి వచ్చింది. ఈ హాలు ఖరీదు కొన్ని లక్షలు. ఇంకా నా ఖరీదు నిర్ణయించుకోలేదనుకోండి."

"ఎంత అదృష్టవంతులు మీరు!" అన్నాను ముగ్ధుణ్ణయి.

**"అదే విచారం.** అదృష్టం మరీ మితిమీరితే మతిపోతుంది. అందుకే ఆ చెట్లమధ్యకి పోయి చీకట్లో కూర్చుంటాను. అయినా అక్కడ దొరికే విశ్రాంతినీ కొందరు పాడుచేస్తారు -"

"నేను వచ్చి మీ ప్రశాంతతని చెడగొట్టానేమో" అన్నాను బాధపడుతూ.

"మీరుకాదు, ఇందాక వచ్చిన ఆ ఇద్దరిమాట నే చెప్పేది. వాళ్ళిద్దరూ ఎవరనుకుంటున్నారు?"

"ఎవరు?"

"రాజకీయనాయకులు. నన్ను ఎన్నికలలో పోటీచేయమంటారు. నేను గెలుస్తానని వీరి సమర్థత హామీ. నా డబ్బూ - ఈ భవనం చూసి నా సుఖం మీద ఏడుపు. సుఖం కోసం కాక, సుఖం మీద విసుగుదలకు చిహ్నంగా ఈ బంగళాను సిద్ధం చేశానంటే వాళ్ళకు అర్థంకాదు."

"మీలాంటి వాళ్ళు దేశనాయకులయితే కాస్తయినా దేశానికి ఉపయోగం ఉంటుందేమో-"

కాళ్ళు మధ్య బల్లమీదికి చేరవేసి వెనక్కి తల వాల్చినవ్వుతున్నాడు రాయలు. మనిషి చాలా అల్పం. కడుపు నొప్పితో గిలగిలా కొట్టుకునే రోగిలాగ ఆ నవ్వుతో చుట్టుకుపోతున్నాడు.

"నేను నాయకుణ్ణయితే మొదట ఏం చేస్తానో తెలుసా?"

"ఏం చేస్తారు?"

"ప్రజలు కోరేవన్నీ అమరిస్తే, విడువకుండా జీవితకాలమంతా అనుభవిస్తామని అందరి దగ్గరా వ్రాతపూర్వకంగా హామీలు తీసుకుంటాను. మర్నాడే అన్నీ ఏర్పాట్లు చేయిస్తాను. పదేళ్ళకి ప్రతివ్యక్తి పిచ్చెత్తడమో, ఆత్మహత్య చేసుకోవడమో జరుగుతుంది. అప్పటి సమస్య ప్రజల్ని పాలించడం కాదు. పిచ్చివాళ్ళకి పెద్ద పెద ఆసుపత్రులు కట్టించడం -" ఇంకా నవ్వుతున్నాడు.

"ఎందుకంటారు?" అన్నాను బలహీనమైన గొంతుతో.

వాక్యానికీ, వాక్యానికీ మధ్య ఒక పావుగంట సరిపోయే ఆలోచనని వదిలేస్తాడు రాయలు. మొదటిసారి అతనిని పరిచయం చేసుకున్ననాడు అతనిని చాలా పెద్ద విజ్ఞానకర్తగానో, పెద్ద తెలివితక్కువ ఫూల్‌గానో భావిస్తాడు.

"మనకేం కావాలనుకుంటున్నామో అది పూర్తిగా ఆలోచించడంలేదు కనుకనే హాయిగా బ్రతుకుతున్నామండి. ***మనకు కావలసినవన్నీ పూర్తిగా ఇవ్వలేదని దేవుణ్ణి తిట్టే భక్తులంతా ఆ దేవుడు జీనియస్‌ను కాస్సేపు ఆలోచించరు. మూగ పెళ్ళానికి నోరు కావాలని ఏడ్చే భర్త ఆమె నోటిలో తనకు మృత్యువుందని ఊహించడు. డబ్బుకోసం ఏడ్చే దరిద్రుడు ఈ తక్కువతనంలో తృప్తి ఉన్నదని ఆలోచించడు. ఈ అసంతృప్తి, ఏదీ పూర్తిగా లేకపోవడంలో ఓ వింత తృప్తి ఉంది.*** ఉదాహరణకి - చాలా గొప్ప పదవులలో ఉన్న

వ్యక్తులూ, పెద్ద ధనికులూ, పెద్ద అందగత్తెలూ ఆత్మహత్య చేసుకొనడం వింటాంగాని కురూపులూ, బిచ్చగాళ్ళూ, గుమాస్తాలూకాదు. వాళ్ళెప్పుడూ సాధించనిదేదో సాధించడానికి ఆశతో బ్రతుకుతూంటారు. తమలో ఒక పెర్ఫెక్షన్ వచ్చిందన్న ఆలోచనే తమని చంపేస్తుంది. ఆ ఆలోచన వచ్చాక ఒక గర్వం ఏర్పడుతుంది. దానిలోంచి నిస్పృహ వస్తుంది తను కోరినదంతా ఉండడం ఎంత ప్రమాదకరమో యోచించండి -"

ఇంత మాట్లాడాక అలసిపోయినట్టుకళ్ళు మూసుకున్నాడు. అది మాటలవల్ల అలసటో, ఆలోచనలవల్ల అలసటో తెలియలేదు.

నిశ్శబ్దంగా కిటికీ వెనక కనిపించే చెట్లవేపు చూస్తూ కూచున్నాను. కళ్ళుమూసుకునే మాట్లాడాడు రాయలు "నేనిట్లా వాగుతున్నానేమిటా అని ఆశ్చర్యపోతున్నారుకదూ? సంవత్సరానికో, రెండేళ్ళకో ఒక్కసారి ఇట్లా మాట్లాడుతాను. ఎదుటి వ్యక్తి గొప్పతనం మీద, తెలివి మీదా నాకు నమ్మకం కుదరాలి ముందు -"

"నామీద మీకెలా నమ్మకం కుదిరింది మరి?"

నవ్వాడు. లేచివచ్చి మరీ చిన్నకుర్రాణ్ణి బుజ్జగించినట్టు భుజం తట్టాడు. "ఆరోజు మోటార్ సైకిల్ మీద నా నిర్లక్ష్యాన్ని క్షమించినందుకు మీ మీద నమ్మకం ఏర్పడింది.

కొత్తగా పరిచయమయిన వ్యక్తిముందు నేను చెడ్డవాడిగా నటిస్తాను. ఆ చెడ్డను సహించే ఓర్పుగల వ్యక్తి నాకు మంచి మిత్రుడవుతాడు, ***చెడ్డతనాన్ని చెడ్డవారు భరించలేరు. చెడ్డతనాన్ని భరించేవ్యక్తి మహాత్ముడో, మంచివాడో కావాలి.*** అది నా ఫిలాసఫీ. ఇప్పుడు చెప్పండి. మీరెట్లా బ్రతుకుతున్నారో -"

"హాయిగానే ఉన్నాను" అన్నాను హాయి గురించి రాయల నిర్వచనాన్ని ఎదుర్కొనవలసి వస్తుందా ఊహిస్తూ.

వెళ్ళి మంచం మీద నిటారుగా పడుకున్నాడు. ఎదురుగ్గా రాధాకృష్ణుల తైలవర్ణ చిత్రం - రాధకు కృష్ణుడి మీద ఉండే ప్రేమగురించో, కృష్ణుడికి రాధలాంటి అమాయిక మీద ఉండే క్యూరియాసిటీ గురించో మాట్లాడతాడనుకున్నాను. పొందిక ఉండే భావాలను వ్యక్తం చేయడు రాయలు. అతని ప్రతి ఆలోచనా ఎక్కడికక్కడ తెగిపోతుంది. తరువాత తీరికగా కూచుని అతని వాక్యాల్ని ఒకచోట ముడివేసుకోవాలి. అందుకని హఠాత్తుగా రాయలు ఆకాశం నీలిమను గురించో, పంచవర్ష ప్రణాళికలకీ భగవద్గీతకూ ఉండే తారతమ్యాన్ని గురించో మాట్లాడితే ఆశ్చర్యపడేవాడిని కాదు, కానీ వాటి గురించి మాట్లాడలేదు. అంతకంటే ఆశ్చర్యకరమైన నిర్ణయం చెప్పాడు.

"చూశారా? - రాను రాను నాకు స్త్రీ మీద నమ్మకం, విశ్వాసం, భక్తి పెరిగిపోతూంది."

తుళ్ళిపడ్డాను. భారతదేశంలో సంప్రదాయాలూ, బేసిక్ ప్రిన్సిపల్స్, ఆలోచనలూ నమ్మకాలమీద దాడిచేసిన వ్యక్తి - రాయలు - వీటన్నిటికీ అట్టడుగున ఉండే గొప్ప సత్యాన్ని అంగీకరిస్తాడనుకోలేదు. ఈ సత్యాలూ, నమ్మకాలూ, సంప్రదాయాలూ, అన్నిటికీ మంచి ప్రమాణం ప్రతినిధి స్త్రీ. అన్నిటినీ కాదని స్త్రీ మీద నమ్మకం ఉందనడం పెద్ద ఏడు అంతస్థుల మేడను నిర్మించి పునాదిరాయిని పీకి పారేయడం.

ఈ దిగ్భ్రమతో సతమతమవుతూండగా, నా తెల్లబాటుకి చూసి పకపకా నవ్వడం ప్రారంభించాడు రాయలు. "ఉండండి. అప్పుడే నా ఓటమిని అంగీకరించడం లేదులెండి. కానీ ఇటీవల స్త్రీ నన్ను ఆలోచించేటట్టు చేస్తోంది. ఈ జీవితం అంతా పెద్ద ప్రయోగం. ఒక్కొక్క విలువనూ నిరూపించుకుంటూ వచ్చాను. చివరికి ఈ జీవితానికే అర్థం లేదని తెలుస్తుంది. అంత మాత్రాన ప్రయోగం విఫలమయినట్టు కాదు. జీవితానికే అర్థంలేదన్న విషయం రుజువు కావడము ఒక ప్రయోజనమే"

నాకు ఇంకా ఆసక్తి పోవడంలేదు. ఒక కుర్చీ లాగుకుని రాయలు మంచం పక్కకి జరిగాను. "ఈ నాలుగు సంవత్సరాల్లో మీకు చాలా అనుభవాలు ఎదురయి ఉంటాయి. చెప్పండి. అప్పుడు మీ మార్పుకి కారణం అర్థమవుతుంది -"

"చెప్పడం కాదు - చూపిస్తాను. ఇప్పుడు ఎనిమిదికదా? - రాత్రి ప్రయాణమంటే మీకు భయమా?"

గుండె ఝుళ్ళుమంది. మళ్ళీ మోటార్ సైకిల్ ప్రయాణం, నడుంనొప్పి, మూడు గంటల్లో గడిచిన అయిదు ప్రాణగండాలు గుర్తుకొచ్చాయి.

"వద్దు. మోటారు సైకిలు మీద అసలు రాలేను" అన్నాను.

"కాదులెండి. కారుమీద వెళ్దాం. ఇరవైమైళ్ళూ గంటలో వెళ్తాం. మళ్ళీ రేపు మీకు కనిపించను. పాట్నా దగ్గర మా మిత్రుడు చావు బ్రతుకుల్లో ఉన్నాడు. వెళ్ళి పలకరించాలి" అని లేచాడు.

## 5

భోజనం అయేసరికి గాలి చల్లబడింది. ఆ చీకటిలో సోమరిపోతు శరీరం కూడదీసుకుని నిద్రపోతున్నట్టు చెట్లన్నీ ఆకుల్ని కూడదీసుకుని కునుకుతున్నాయి. రాయలు గదిలో కిటికీ దగ్గర నిలబడితే - చెట్లమధ్య ఎర్రలైట్ల వెలుగులో మీదికి వేస్తున్న నీటిధారలు కనిపిస్తున్నాయి. చీకటి బ్రతుకు నుంచి తప్పించుకు బయటపడాలనే ఆశను మీదికి దూసుకుపోయే ఎర్రటి నీటి చారలు గుర్తుచేస్తున్నాయి. కానీ ఈ తోట చీకటిలోంచి పైకి దూసుకు వెళ్ళి, శక్తిలేక, మళ్ళీ చీకటిలోకి జారుతున్నాయి. మానవ జీవితానికి సహజ నిర్వచనంలాగ.

పెద్ద ఉలెన్ కోటు తొడుక్కుని శాలువా పట్టుకుని వచ్చాడు రాయలు. తలమీద వేటకు వెళ్ళేటప్పుడు పెట్టుకునే బలమైన టోపీ భుజానికి తుపాకీ. శాలువ నాకిచ్చి "రండి, వెళదాం. మరీ ఆలశ్యమయితే దొంగలనుకుంటారు పల్లెటూరివాళ్ళు అనుకున్నా తుపాకితో జవాబు చెప్పవచ్చులెండి"

"ఇంత రాత్రిలో వెళ్ళకపోతేనేమండీ ఉదయాన్నే వెళదాం."

"ఈ అలసత్వంతో మనం జీవితంలో ఎన్నో అవకాశాల్ని పోగొట్టుకొంటాం. జీవితంలో నిద్ర, రాత్రి అంత అనవసరమైంది మరొకటిలేదు. అసలు నిద్రలేకుండా ఉండడమో, నిద్రలో కూడా ప్రయోజనంకల పనులు చేయడానికి ఎవరన్నా పరిశోధనలు చేస్తే బాగుణ్ను. ఒకపని అనుకున్నాక జరిగితీరాలి - పదండి. రేపు మళ్ళీ మిమ్మల్ని కలవను."

నా సమాధానానికి ఎదురు చూడకుండా ఎవరో నౌకర్ల పేరుపెట్టి పిలుస్తూ బూట్లు టక్ టక్‌లాడిస్తూ మేడ దిగిపోయాడు. రాయలు విసుగుకీ, నిర్లక్ష్యానికి నిదర్శనంగా మోటార్ సైకిలు ప్రయాణం ఒక్కటే గుర్తు నాకు. కోరికోరి ప్రమాదాన్ని తెచ్చుకున్నానేమోనని మనస్సులో నన్ను నేను నిందించుకున్నాను. కానీ ఇక తప్పదు. అప్పుడే తోట చీకట్లోంచి నాపేరు పెట్టి అరుస్తున్నాడు రాయలు. కిటికీలోంచి చూస్తే ఏదో రాజ్యాలపై దాడిచేస్తున్న సైన్యాధిపతిలాగా కనిపించాడు. వణికే మనస్సును పదిలపరుచుకొనడానికి ప్రయత్నిస్తూ మెట్లు దిగాను.

కానీ ఆనాడు కారు నడిపే సాహసం మీద రాయలుకి దృష్టి లేనట్టుంది. సిగిరెట్టు వెలిగించి, కారు ముందు క్రమంగా కరిగిపోతున్న చీకట్లోకి చూస్తూ కూచున్నాడు.

నిశ్శబ్దంగా ఉన్నప్పుడు రాయలను చూస్తే గుర్తుకొస్తుంది. ఏదో ఘాతుకకృత్యానికి సిద్ధపడుతున్నట్లు సన్నటి కళ్ళు మరీ చిన్నవవుతాయి. నుదురు మూడతలు పడుతోంది. మోటారు మెషీను వెలుగులో సిగరెట్టు పొగలమధ్య రాయలు ముఖం ఆశయాలతో మసకపడిన జీవితపు బరువును గుర్తు తెచ్చింది.

ఏదో చెప్పాలనుకుని నా వేపు తిరిగాడు - నా ముఖం కనిపించకపోతే కారులో దీపం వెలిగించాడు. మళ్ళా ముందు వెలిగే కారులైట్లవేపు చూస్తున్నాడు.

స్థిరత్వంలేని బలహీనుడి మనస్సులాగా వొదిగి వొదిగి నిలబడినట్లున్న తాడిచెట్లు ఆ కారు శబ్దానికి భయపడి ఒకదానికొకటి కావలించుకుంటున్నాయి.

చెట్లమధ్య అడవిలో అప్పుడప్పుడు వీచేగాలి - ఉబ్బసం రోగి ఊపిరిలాగా లేచిపడుతోంది.

"నేను తీసుకెళ్ళే చోట మీరో వింతశక్తిని చూస్తారు" అంటున్నాడు రాయలు.

అటు తిరిగాను, కళ్ళుమూసుకుని స్టీరింగు మీద తల ఆనించాడు. కారు డ్రైవ్ చేయడం తెగింపుకు చిహ్నం కాబోలు ఎంత అలక్ష్యంగా స్టీరింగు మీద పడుకున్నా గమ్యం తెలిసిన వేటగాడి కుక్కలాగా - ఆ చీకటిరోడ్డు మీద పరుగెత్తుతోంది నల్లటి కాడిలాక్.

"మీరు నన్ను తీసుకురావడమే వింతగా ఉంది" అన్నాను. నవ్వాడు. 'ప్రతిదానికోసం ఎదురుచూడడంలో ఎంచుకుని ఓ పనిచేయడంలో అందంలేదు. హఠాత్తుగా మీరు వానపాము అనుకుంటున్న ఒకటిలేచి పడగ విప్పుతుందనుకోండి అది కరవనే అక్కరలేదు, ఆ ఆశ్చర్యానికి గుండెపగులుతుంది."

"ఇప్పుడు నాకు వానపాముని చూపిస్తారా? పడగ విప్పిన పామునా?"

"నా మనస్సులో పగడవిప్పిన త్రాచు అది. ప్రపంచానికి వానపాము. కానీ రాయలుని ఏదీ త్వరగా గుండె పగిలేట్టు చెయ్యలేదు. పగిలేముందు గుండెకి నా పర్మిషన్ కావాలి" నవ్వుతున్నాడు.

నవ్వులో అందానికి చీకటి సిగ్గుపడుతున్నట్టుంది. నవ్వు వేగాన్ని జీర్ణించుకుని, కాలాన్ని చప్పరించింది. నవ్వు ఆగేసరికి 20 క్షణాల్లో 20 ఫర్లాంగులు గడిచాయి  మా కారు జీవితంలో.

పది దీపాలు మాత్రం కనిపించేచోట కారు హఠాత్తుగా ఆపాడు రాయ్. చిన్న పల్లెటూరిలాగా ఉంది. పక్కన ధాన్యపు కుప్పలు ఎత్తుగా కనిపిస్తున్నాయి. పక్కనే చలిమంటలు వేసుకుని, ఏవో ఉల్లాయిపదాలు పాడుతున్నారు రైతులు -

సీకటీ సిదిమితే సీతాలు పుట్టింది<br>
సిక్కనీ నవ్వులో సిక్కుకొందట మనసు<br>
సీతాలు నవ్వితే సీకటికె సిగ్గంట<br>
సిగ్గులోనే వెయ్యి సిత్రాలు పోతాది.

"చూశారా! చీకటిని జయించగలవాడికి వెలుగు స్వాధీనపడుతుంది. మనం వెలుగులోనే బ్రతకగలం. వాళ్ళకి చీకటికూడా సుఖాన్నిస్తుంది" అన్నాడు రాయలు.

వెలుగులో ఇంత పెద్ద మనుషుల్ని చూడని పల్లెటూరి కుక్కలు అరవాలో లేదో తెలీక తెల్లబోయి దారిపక్క నిలిచిపోయాయి. ఆధునిక ప్రపంచంలోనికి ఆదిమ మానవుడు వచ్చినప్పుడు చూసేంత చిత్రంగా ఆ పల్లెటూరి ప్రజలు మమ్మల్ని చూస్తున్నారు. గుడ్డిదీపాల వెలుగులో చీకటి నల్లనై - బలహీనమైన కోరికలాగా - అంతటా వ్యాపించడానికి తారట్లాడుతోంది.

ఆ ప్రాంతాన్ని బాగా ఎరిగి ఉన్నట్లు అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు రాయలు.

"మీరక్కడ పట్టణాల్లో చూసే స్త్రీల ప్రమాణాలతో బేరీజు వెయ్యకండి ఈమెని. మనస్సును గమనించండి చాలు. ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి.

రాయలును ఈప్రపంచంలో ఏదీ మార్చలేదన్న గర్వం రెండేళ్ళక్రిందట ఉండేది. ఈ ప్రపంచంలో ఒక స్త్రీ మాత్రం రాయలును మార్చగలదేమోనన్న అనుమానం ఇప్పుడు మిగిలింది. అదీ ఆమెకి ఇంట్రడక్షన్ ఇక పదండి" అని తడికె తలుపు తోసి ఒక ఇంటిలోకి వచ్చాడు.

తలుపు త్రోయగానే ఎదురుగ్గా కుంకుమ బొట్లతో ముఖం కనిపించకుండా పోయిన వెంకటేశ్వరుడి పటం కనిపించింది. ఆ పక్కనే పెద్ద పులితల - మంచిమనిషి మనసులో అంతరాత్మలాగా ఆ చీకటిమధ్య పుచ్చిస్తున్నట్లు మెరుస్తున్న పులి కళ్ళు అదురుపాటుని కలిగిస్తున్నాయి. ఓ మూల దీపం వెలుగుతోంది. అప్పుడే ఆర్పిన చిన్న పొయ్యినుంచి కుడివేపున ఏదో పొగలేచి సుడులు తిరిగి, బయటికి పోను మార్గానికి గదంతా పచార్లు చేస్తోంది. గోడకు చేరవేసి ఓ నులకమంచం, రెండుపెట్టెలు, ఏవో అతుకులు అతుకులుగా చేర్చిన పుస్తకం మాత్రం వ్యాసపీఠం మీద ఉంది. దాని బైండు చూసి అది రాయలుదని పోల్చుకున్నాను. అక్కడకు వెళ్ళి పైకి తీశాను. రాయలుదే - భాగవతం.

"ఏభై ఏళ్ళు బ్రతకక ఈ పుస్తకం చదువు. ఏభై ఏళ్ళు బ్రతికిన అనుభవం కావాలన్నా ఈ పుస్తకం చదువు. ఎందుకంటే నీ బ్రతుక్కి అర్థం మారిపోతుంది" అని రాశాడు లోపల.

ఇంతవరకు తల ఎత్తలేదు నేను. ఇప్పుడు చూస్తే మరీ చీకటిగా ఉన్న మూల రాయలు ఎవరినో పలుకరిస్తున్నాడు. ఏమంటున్నాడో ఇంకా అర్థంకావడంలేదు. 'మదర్' అంటున్నాడు గావును.

ఉన్నట్టుండి మంచం మీద ఎవరో తుళ్ళిపడి లేచారు. భాగవతం చేత్తో పట్టుకు కూచున్నాడు. లేచిన వ్యక్తి అతడ్ని చూస్తూనే తలమీదకి చీరెకొంగు లాక్కుంటూంది. క్రిందకి వంగి ఒక్కసారి అతనికి నమస్కారం చేసింది.

"ఒక్కసారి మీరిటు చూడకండి సార్" అని నాతో స్వగతంలాగా చెప్పి, ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి ముద్దు పెట్టుకున్నాడు.

ఇప్పుడామె నన్నుచూసి సిగ్గుతో కుంచుకుపోయింది. ఆ చీకటిలో ఇంకా ముఖం స్పష్టంగా తెలియడంలేదు. కానీ కళ్ళల్లో మెరుపు మాత్రం అర్థమవుతోంది. అవతలి చివరికి నడిచి దీపం పెద్దది చేశాడు రాయలు.

"ఇప్పుడు చూడండి మా మదర్ని. అసలు పేరు తమ్మి కాని నేను 'మదర్' అంటాను. కారణాలు తర్వాత చెప్తాను" అన్నాడు.

పరిచయం చేసేటప్పుడు నూతన వ్యక్తికి నమస్కరించాలన్న అలవాట్లు ఆమెకేమీ పట్టవు. నన్ను ఆశ్చర్యంతో చూస్తోంది - అట్లా చూడడంలో సిగ్గు పడాలనికూడా తెలియనట్లు - వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా తెలుస్తోంది.

మంచి పాలరాతి నునుపు మీద పెదాల్ని చెక్కినట్టు ఆ ముఖంలో ఇంకేమీ కనిపించవు - కళ్ళు పెదాలూ తప్ప నలుపు మనిషి ముక్కు అందం తెలియడం లేదు. పెద్ద చక్రంలాంటి ఆభరణమేదో ముక్కునీ, సగం కుడి చెక్కిలినీ కప్పింది. తమ అందానికి దిష్టి తగలకుండా అలా తగిలించుకుంటారేమో వాళ్ళు. ముక్కు కూడా అందంగా ఉంటుందా? కళ్ళు, చూపులు ఇచ్చిన సాక్ష్యంతో సరిపెట్టుకున్నాను. మెడలో ఏవో నల్లటి పుసలు, కొసలు తేరి ఉన్నాయి. నవ్వదు, మాట్లాడదు. ఓ శిలాప్రతిమలాగా కనిపించింది, ఉన్నచోట.

"మాకేమైనా ఇవ్వవూ? - అతిథులం కదా!" అన్నాడు రాయలు మంచం చివర కూర్చుంటూ.

అటు తిరిగి "సాల్లే, పెద్దన్న తాగేసిపోనాడు" అంది. ఆ ముఖంలో క్షమాపణకాని, ఇవ్వలేకపోయానన్న బాధగానీ లేదు. అంత నిర్లిప్తత గొంతులో. ఎక్కడో విన్నట్టు, చిరపరిచితం లాగ, రబ్బరు బెలూనులోంచి గాలిపోయినంత సాఫీగా మాట్లాడుతోంది. కానీ మాటలో సంస్కారంలేదు. మనిషిలో ఏ కోశానా సెంటిమెంటులేదు. పదినెలలు ఓనమాలు నేర్పించి తర్ఫీదు ఇస్తే ఎట్లా మాట్లాడుతుందో చూడాలనిపించింది.

ఆ మాటలకి రాయలు నవ్వుకున్నాడు "పోనీలే లేకపోతే అచ్చన్న ఎక్కడికి పోయాడు?" అన్నాడు.

"పొలం గట్టుకి - శతిలి పంటకి కాపలా ఉండడానికి తాగుడు తెచ్చుకుందుకు పోయినాడు" అంది.

బడిపంతులు ముందు విద్యార్థి వినయం, భక్తి, విచిత్రమయిన సిన్సియారిటీ ఆమె మాటల్లో గమనించి విస్తుపోయాను. అతడు ఇంకేమైనా ప్రశ్నలేస్తాడేమో, దానికి సమాధానం చెప్పడానికి ఆలశ్యమవుతుదేమోనన్నట్టు అతనిలోంచి దూసుకుపోయే చూపు చూస్తోంది తమ్మి.

ఇప్పుడు వెలుగులో ఆమెకు జాకెట్టుకూడా లేదని గ్రహించాను. కానీ కావిరంగు చీరె బలమైన చెట్టు చుట్టూ పాకిన లతలాగ శరీరం చుట్టూ వంపు తిరిగింది. మనిషి పొడుగు. ఆ అమాయకతలో, నిశ్శబ్దంలో, భక్తిలో ఎంతో ఠీవి, హుందా కనిపించింది. ఇంత ఉద్ధుతంగా మాట్లాడే రాయలు కూడా ఆమె ముందు మాట్లాడటానికి ప్రశ్నలు సిద్ధం చేసుకుంటున్నాడు. నాకు నవ్వొచ్చింది.

***పెద్దపెద్ద జీనియస్‌లకు చాలా విచిత్రమయిన సమస్యలు వస్తాయి. తమ విజ్ఞతను అర్థం చేసుకుని గౌరవించే చోట వాళ్ళు దూసుకుపోతారు. కానీ విజ్ఞత అవసరాన్నే ప్రశ్నించేచోట వాళ్ళకి అగ్నిపరీక్ష ప్రారంభమవుతుంది. కానీ ఆ పరీక్షలో గెలిచినవాడు మహాపురుషుడవుతాడు. ఉదాహరణకు - బుద్ధుడు, క్రీస్తు.***

ఏ విషయమన్నా తమ్మి గటగటా మాట్లాడుతుందేమోనని ఇంతసేపూ ఆసక్తితో ఎదురుచూస్తున్నాను. ఈమెలో ఏ విచిత్రాన్ని చూపాలని రాయలు నన్నిక్కడకు తీసుకువచ్చాడు? ఇదే ఆలోచిస్తున్నాను.

"నిన్ను చూస్తానన్నాడతను. తీసుకువచ్చాను. నువ్వెంత విచిత్రంగా ఉంటావో ఇప్పుడితను చెప్తాడు నాకు"

ఆ మాటలు ఆమెకు అర్థం కాలేదని అనుమానం నాకు. సమాధానంగా ఆమె నవ్వలేదు. నావేపు ఒకసారి చూసింది. ఇంకా అట్లాగే నిలబడివుంది.

"కూచోండి" అన్నాను నేనే చివరికి. రాయలువేపు చూసింది.

"అవును, కూచో. దీనికి నా పర్మిషన్ అక్కర్లేదు."

మంచం రాటకి చేరబడి కూచుంది.

చాలాసేపటివరకు నిశ్శబ్దంగా కూర్చున్నాం. వస్తువును కొనుక్కునేముందు పరిశీలనకు నిలిపినట్టు మా ఇద్దరి ముందు బొమ్మలాగా ఉంది తమ్మి. అట్లా చూస్తూ కూర్చోవడం నాకే బాగా కనిపించలేదు.

"ఇక పోదాం" అన్నాను.

ఇప్పుడు లేచి "పోదాం పదండి. రాయలు ఎంత తెలివి తక్కువవాడో దారిలో చెపుదురుగాని" అన్నాడు.

"నేను వెళ్తానండి" అన్నాను.

ఈసారి ఏమైనా మాట్లాడుతుందేమో ననుకున్నాను. కానీ తల ఊపింది. లేచి బయటి తలుపు తడికి తీసి పట్టుకుంది.

నా తెల్లబాటుకి చూసి నవ్వుతున్నాడు రాయలు. "వండ్రఫుల్ మదర్ - నువ్వంటే నాకెంతో ఇష్టం" అని ఆమె మీదకి వంగి మళ్ళీ ముద్దుపెట్టుకున్నాడు. నేను దగ్గర ఉండగానే అతనట్లా చేయడం ఆమెలో వణుకుదలను కలిగించినట్లుంది, అప్పుడు నవ్వింది. నవ్వులో ప్రత్యేకమైన అందం ఉన్నదని హఠాత్తుగా గ్రహించాను. అందుకనే హెచ్చుగా నవ్వదుగావును. ఆ నవ్వు చూసి పిచ్చెత్తిపోయాడు రాయలు. ఇంగ్లీష్‌లో వివిధరకాలుగా, ఆశ్చర్యాన్నీ, సంతోషాన్నీ ప్రకటిస్తూ దిమ్మతిరిగిపోతూ బయటికి వచ్చాడు. మేము కనుచూపు మేర దాటిపోయే వరకన్నా ఆమె అక్కడ నిలబడలేదు.

బయటి కంటే కారులో వెచ్చగా ఉంది. అద్దాలన్నీ మూసి కారు పోనిచ్చాడు.

"వండ్రఫుల్ క్రీచర్ సార్ మంచి ఆడదాన్ని చేయడానికి బ్రహ్మ అన్నిటినీ దగ్గరకు చేర్చి సగంలో విసుగుపుట్టి క్రియేషన్ ఆపేశాడు. అందువల్ల మదర్ తయారయింది. ఇంకా ఆడదానిలో ఉండవలసిన మరొక భాగం ఆమెలో డెవలప్ కాలేదు. అందువల్లనే ఆమె అంత విచిత్రంగా ఉంది. మీరేమంటారు?" అన్నాడు.

ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. స్త్రీ అంటే ఏమాత్రం గంభీరం భావం లేని రాయలుని ఈమె ఆకర్షించడం ఒక ఆశ్చర్యం. ఆమె జీవితాన్నే మార్చిందంటున్నాడు. ఏ విధంగా ఈమె ప్రభావం అతనిమీద పడిందో అర్థం కావడంలేదు. అదే అడిగాను.

"ఏ విషయం?"

"ఆమెను చూడగానే మీకేమనిపించిదో చెప్పండి మొదట."

"పట్టణాల్లో ఉండే స్త్రీలాగ ఆమెని తయారుచేస్తే ఎట్లా ఉంటుందా అని ఆలోచించాను" అన్నాను.

గుక్క తిప్పుకోకుండా నవ్వుతున్నాడు రాయ్.

"అట్లా చచ్చినా తయారుకాదు. అట్లా చేస్తారని తెలిస్తే ఆ రోజే ఆత్మహత్య చేసుకుంటుంది. మరొక్క విషయం గమనించారా? తనకేమీ తెలియదని ఆమెకు బాగా తెలుసు. అందుకనే ఆమె గర్వం. నాకేమీ తెలీదు. అయినా నేను ఆడదాన్ని. అది మాత్రం తెలుసు - అంటుంది"

"రాయలుగారూ! ఒక్కటి అడుగుతాను చెప్తారా?"

రాయలు పక్కకి తిరిగి నా కళ్ళల్లోకి చూశాడు. "మీరేమడుగుతారో నాకు తెలుసు. అయినా అడగండి"

"ఆమెలో ఏ విషయం మిమ్మల్ని ఆకర్షించింది?"

"నాగరికులమని, అభ్యుదయభావాలు కలవారమనీ నానాటికీ పెరిగిపోతున్న ఈ ప్రజలని చూసిచూసి విసిగిన నాకు పాత మొండి ఆలోచనలో, పాత మూఢ సంప్రదాయాలలో ఒక అందాన్నీ, విచిత్రమైన విశ్వాసాన్నీ చూపింది తుదకు. ఒక్క క్షణం గుండె నిలిచిపోయింది. నా రివోల్టునంతా పూర్వం ఋషులూ, పురాణాలూ చేసేశాయి. మనమిక చేయగలిగేదేమీలేదు. అయితే ఇప్పుడు పాడయిన ప్రపంచం మాటంటారా? - పాతను సరిగా అర్థం చేసుకొలేక, కొత్తను సరిగా ఒదిగి బ్రతకలేని త్రిశంకములో ఫూల్స్, బడుద్దాయిలు ప్రపంచం - మదర్ ఏజ్ ఓల్డ్ భారత స్త్రీ. రాయలు 'ఆధునికత' మీద తిరుగుబాటు. ఈ రెంటికీ ఎక్కడో పొత్తు కుదురుతుంది. మీకు లెక్కలు తెలుసుకదా? ఆవిడ ప్లస్, నేను మైనస్xమైనస్" నవ్వుతున్నాడు.

ఇది చెప్తూనే ఎంత తృప్తి పడుతున్నాడో, తన నిర్ణయాలకూ, తన ఆలోచనలకూ ఎంత గర్వపడుతున్నాడో కానీ ముందు గాజు పలకమీద అతని ప్రతిబింబాన్ని చూసి గుర్తించగలిగాను.

"కానీ మదర్ మిమ్మల్ని ఎట్లా ఆకర్షించిందో చెప్పలేదు" అన్నాను కాస్సేపటికి.

కారు వేగంతో సంబంధం లేకుండా, కళ్ళు మూసుకుని కూచున్నాడు కొన్ని క్షణాలు. మృత్యువును ఒరుసుకొంటూ మా కారు తొందరగా దూసుకుపోతోంది గమ్యం వేపు. నిర్లక్ష్యంలో బ్రతికే వ్యక్తి జీవితంలాగా ఉంది కారు. దగ్గరికి వచ్చిన చెట్లు గాలికి కదిలి ఫలితం తెలిసిన వేదాంతులలాగ నవ్వుతున్నట్లున్నాయి.

**అంతలో కళ్ళు విప్పి అన్నాడు:** "మాటల్లో కంటే మౌనంలో ఎక్కువ భావం ఉంటుందండి. గాంధీ మాట్లాడి ప్రజల్ని మార్చాడు. బుద్ధుడు మౌనంతో మార్చాడు. కానీ బుద్ధుడిని చూసి ఉంటే గాంధీ మారిపోతాడని సిద్ధాంతం. మారిపోవడమంటే మౌనంలోగల శక్తి, తేజస్సు విచిత్రం. సంప్రదాయాలని ఏ క్షణానికా క్షణం చీల్చుకుపోయే నాకంటే సంప్రదాయాలను క్రూడ్‌గా అంగీకరించి, మౌనంగా

భరించే వ్యక్తి పెద్ద విప్లవకారుడు. నాది సంఘంతో తగాదా, వాడిది మనస్సుతో తగాదా. మౌనంతో అప్పుడే మనస్సును సగం జయించి వుండేవాడు. కానీ సంఘంతో నా జయాపజయాలు - నా ప్రయత్నాలలో, ప్రజలపై ఆధారపడి వుంటుంది. ఇంత చెప్పాక రాయలుకీ, మదర్‌కీ తేడా చెప్పనక్కరలేదు. సంఘంతో తగాదాపడి ఇంకా ఉక్కిరిబిక్కిరయి పోరాటం సాగిస్తున్న వాడిని నేను. మనస్సుతో పుట్టుకనుంచీ తగాదా పెట్టుకుని అప్పుడే జయించిన వ్యక్తి మదర్. అందుకే ఆమె అంటే భక్తి నాకు. ఇప్పుడు నాకొచ్చిన సమస్యల్లా ఆ భక్తిని ప్రేమగా మార్చాలని."

"అంటే ఏం చేసిందంటారు మదర్?"

నవ్వుతాడు మళ్ళీ. "ఏమీ చెయ్యలేదు ఆమె. అదే ఆమె చేసిన గొప్ప ఫీట్. చాలా చేసిన నాకంటే ఏమీ చెయ్యని ఆమె వెయ్యిరెట్లు నయం."

"నన్నింకా గాభరా పెడుతున్నారు - స్పష్టంగా ఒకటో క్లాసు కుర్రాడికి చెప్పినట్టు చెప్పండి."

ఇప్పుడు నా మీద జాలిపడుతూ అన్నాడు - "అవునవును. మరిచిపోయాను. మీరు ఆంధ్రరచయిత కదూ, ఇంత యసిడిటిని భరించరు వాళ్ళు. తమ్మిని ఓరోజు సాయంకాలం పొలం గట్టున చూశాను. ఇక్కడ ఉన్నవాళ్ళంతా సగం పైగా నా పొలంలో పనిచేస్తున్నవాళ్ళే. స్నేహం ఎట్లా కలిసిందో చెప్పను. కోతలయేవరకూ, మనం యిప్పుడు చూసిన పాకలో, ఈ కారులో గడిపాను. ఏదో పిచ్చెత్తినట్టుండేది. అప్పట్లో నా మెదడులో వెయ్యి సమస్యలు తనకు యిష్టంలేకపోతే నన్ను ఎదిరించేదే! నా డబ్బుని చూసి ఆశపడిందనను. ఎందుకంటే ఎప్పుడూ డబ్బుతీసుకోలేదు నాదగ్గర. ఎప్పుడూ ఏడవదు కానీ, డబ్బు యిస్తానని బలవంతం చేస్తే బావురుమని ఏడుస్తుంది. భయపడి యివ్వడం మానేశాను. 'నీకు నా మీద అసహ్యం కలగలేదా?' అన్నాను. నవ్వింది. 'నిన్ను పాడు చేశానన్న కోపంలేదా?' అన్నాను. మాట్లాడదు. మాట్లాడించడానికి ఎంతో ప్రయత్నించాను. ఊహూ. కానీ చేతుల్లోకి తీసుకుంటే తాత్సారం చెయ్యదు. వెన్నసుద్ద మనిషి. ఇంత అనుభవంలో తమ్మిలాంటి మనిషిని ఎన్నడూ చూడలేదు నేను. మొదట చాలా విచిత్రంగా వుండేది. కానీ క్రమంగా అలవాటు పడిపోయాను. అప్పుడప్పుడు మాట్లాడేది. తను సుఖంగా ఉన్నాననేది. నేనంటే కోపం లేదంది. నిన్ను సుఖపెట్టడమే నాకు కావాలంది. ఇదంతా ప్రతి ఆడదీ మాట్లాడే డైలాగే. దేవుడు కొంత ప్రతి ఆడదానికి సమానంగా, నిష్పక్షపాతంగా రాసియిచ్చేస్తాడు. అవసరం వచ్చినప్పుడల్లా ఆ మాటల్ని అటూయిటూ తికమకగా వాడుకుంటూంటారు వాళ్ళు. ఇది అప్పటి అనుభవం.

"కొంతకాలం అయాక పట్నానికి వచ్చేశాను. నా మనస్సు చిత్రమైన యంత్రంకదా - జ్ఞాపకాల మీట నొక్కి మెదడులో ఆ భాగాన్ని చీకటి చేసుకుంటే సంతోషపు అరలో వెలుగు కనిపిస్తుంది. మరుసటి సంవత్సరం నేను మోటార్ సైకిలు తయారీ నేర్చుకొనడానికి వెళ్ళి, కోతకిరాలేదు. మా గుమాస్తాను మాత్రం పంపాను. పదినెలల తరువాత యిక్కడేదో ఆక్సిడెంటు జరిగిందంటే చూడడానికి వచ్చినప్పుడు - అచ్చన్న - ఆమె అన్నయ్య కనిపించాడు. నన్ను చూడగానే పరిగెత్తుకు వచ్చాడు. మొదట వాడిని గుర్తుపట్టలేకపోయాను.

'నేనండి అచ్చన్నను' అంటాడు.

'ఏం కావాలి నీకు?'

'మా చెల్లెలు తమ్మిని మరిచిపోయారా బాబూ?' అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది. నిజమే, మరిచిపోయాను.

'ఏమయింది నీ చెల్లెలికి?' అని తెలియనట్టు అడిగితే వాడు గుక్కతిప్పుకోకుండా ఏడ్వడం ప్రారంభించాడు. ఆ తర్వాత మదర్ యింటికి వెళ్ళాను. అక్కడికి వచ్చాక నా ఆశ్చర్యానికి అంతులేదు. చెప్పండి, అక్కడ ఏం చూశానో?" ఆరిపోతున్న సిగరెట్టుకి కొత్తది వెలిగించాడు రాయలు.

ఈ కథ నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వర్తమానంలో వైచిత్రంకంటే భూతకాలంలో విచిత్రం ఎక్కువయి నాకేం తోచనివ్వడంలేదు.

సమాధానం కోసం ఎదురు చూడలేదు రాయలు. ఈ విషయంలో ఎంత గొప్ప ఊహకయినా అపజయం తప్పదని రూఢి చేసుకున్నట్టున్నాడు. అతనే చెప్పాడు చివరికి.

"బాగా అలికి, ముగ్గువేసిన ఓ మూల నేను కాల్చి వదిలేసిన సిగరెట్టు పీకలు, నేను మరిచిపోయి వచ్చేసిన 'టై' వున్నాయి. వాటికి తమ్మి పూజలు చేస్తోందట యిన్నాళ్ళూ" విరగబడి నవ్వడం ప్రారంభించాడు.

నాకు నవ్వు రావడంలేదు. ఆ చిన్న వెలుగులో చూసిన పల్చటి పెదాల్లో ఆ మంటలు కక్కే కళ్ళలో యింత పట్టుదల ఉన్నదా అని ఆశ్చర్యపోతున్నాను.

"మీలాగే నేను అప్పుడు దిమ్మెరపోయాను. మరొక ఆశ్చర్యకరమైన విషయం చెప్పిందప్పుడు."

"ఏమిటి?"

"ఆమెకు నేనే భర్తనట. ఇక జన్మజన్మాలకూ నేనే భర్తగా ఉంటానట - అందుకు పూజలు చేస్తున్నానంది" నవ్వుతున్నాడు. కాస్త ఆగి మళ్ళీ గంభీరంగా మాట్లాడాడు. "ఇదంతా ఉత్త సెంటిమెంటు ట్రాష్. కానీ వీటి వెనక ఒక విశ్వాసం, పట్టుదల, ఆత్మధైర్యం, నిశ్చలత - యివి నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేశాయి. 'నీతో నేనెట్లా బ్రతుకుతాను?' అన్నాను విసుగుగా. ఆమె నవ్వింది. 'నేను బ్రతకమనలేదే?' అంది. 'అయితే నేను నీ దగ్గర ఉండకపోయినా నేనే నీ భర్తనా? '

"అవును."

"ఎందుకో?"

"మొదట మిమ్మల్నే చూశాను అందుకని" అంది.

నాకేం తోచలేదు. నేను వెళ్ళిపోతానంటే విచారం లేదు. "ఈ రెండేళ్ళూ మీరు వస్తారనే బ్రతికానా - ఇక బ్రతకలేక పోవడానికి" అంటుంది. ఇంతభావం మాటల్లో చెప్పలేదు. ఎట్లాగో కళ్ళతో చెప్తుంది. దగ్గరికి వెళ్తే కాళ్ళమీద పడి నమస్కారం చేస్తుంది. ఇట్లాంటి సమయంలో ఏం చెయ్యాలి చెప్పండి?"

నగరం పొలిమేరలలోకి వచ్చింది కారు. సత్ఫలితాలు సాధిస్తున్న మంచి బ్రతుకులో ఆశలాగ, దూరాన పట్నం వెలుగు తెలుస్తోంది.

"ఏం చేశారో చెప్పండి త్వరత్వరగా" అన్నాను.

"మరికొంతసేపు స్త్రీ గురించి ఆలోచించాను. సృష్టిలో ముఖ్యంగా స్త్రీ సృష్టిలో ఏదో 'రీజన్' ఉంది. సంప్రదాయాల జాతి, ఆనవాయి తీరు, సంఘం వదిలేసిన - మానవత దృష్ట్యా స్త్రీకి ఒక తిన్నటి మార్గం ఉంది. ఆ మార్గం నచ్చింది నాకు. హఠాత్తుగా నేను సంసారినయిపోవడానికి అంగీకరించాను. ఆమె పూజావస్తువుల్ని పారేయించేసి, ఆ స్థానంలో నేను కూర్చున్నాను. ఒక రహస్యం చెప్పనా స్త్రీగురించి?"

"ఊఁ"

"స్త్రీకి సంఘం మీదా, పురుషుడుకి సెంటిమెంటు మీదా గౌరవం ఎక్కువ. కానీ స్త్రీకి సెంటిమెంటుమీద గౌరవం పెరిగినా, పురుషుడుకి సంఘం మీద గౌరవం పెరిగినా ప్రళయం తప్పదు. అటువంటి స్త్రీకి మంచి ప్రమాణం మదురు."

"తర్వాత ఏం జరిగిందో చెప్పండి."

"నేను ఆమెతో కలిసి ఉండడానికి ఇష్టపడ్డాక సంతోషించనూ లేదు, విచారించను లేదు. నన్ను ఉండమని అడగదు, ఎప్పుడు వస్తావని అడగదు. డబ్బు సంగతి అసలేలేదు. తనని మరిచిపోతానేమోనన్న భయంలేదు. అంత నిర్లిప్తత ఆమెలో. ఇటీవల ఇందులోగల రహస్యాన్ని కనిపెట్టాను."

"ఏమిటది?"

"తన మనస్సులో ఒక రాయలుని తయారుచేసుకుంది ఆమె. అతనిలో ఇరవైనాలుగు గంటలూ బ్రతకగలదు. తనకి అతను భర్త. నేను మాత్రం ఆమె శరీరాన్ని కోరే విప్లవకారి అయిన రాయలుని. మళ్ళీ వచ్చి ఆమెను ఎప్పుడు కావాలన్నా నాకు కావలసిన శరీరం ఎప్పుడూ నాకు సిద్ధంగానే వుంటుంది. కానీ మనస్సులో మాత్రం తన భర్త 'రాయలు'ని పూజిస్తూనే వుంటుంది. ఓహో! చూశారా ఈ నీతి! భారతదేశంలో మన స్త్రీలని యింత బరువైన బంధాలతో బిగించారు పూర్వులు. కానీ ఆమెలో యితర మూఢత్వాలేవీ లేవు. సూటిగా, సరాసరినపోయే ఆత్మవిశ్వాసం, నిశ్చలత ఉన్నాయి. వాటికి నేను దాసుణ్ణి. "

నాకు కాస్త నిద్దర వస్తున్నట్టుంది. చివరిమాటలు - ప్రయాణపు అలసట. నిద్ర వత్తిడి మధ్య నలిగిపోయాయి. తీరా కారు ఆపి రాయలు నన్ను తట్టి లేపేసరికి తుళ్ళిపడ్డాను. "ఓ విచిత్రమయిన కల కని ప్రపంచం దృష్టిలో పెద్ద స్వర్గమనిపించే భవనానికి వచ్చారు మీరు. లేవండి మంచి కాఫీ సిద్ధంగా ఉంటుంది మనకోసం" అన్నాడు రాయలు. నేను విచిత్రంగా రాయలు వేపు చూశాను. పాతనవ్వే నవ్వుతున్నాడు రాయ్. ఆ నవ్వులో ఇదివరకటి తెగింపూ, విప్లవం, నిర్లక్ష్యం, హేళన, తృప్తి - అన్నీను.

"రాయలుగారూ! మీరు చాలా విచిత్రమయిన మనిషి."

మళ్ళీ నవ్వుతున్నాడు. "విచిత్రం, మంచి, విజ్ఞత యిట్లాంటి మాటలకి అర్థం లేదండి. మీకు నేను విచిత్రం. నాకు మీరు మంచి భగవంతుణ్ణి చూసి 'నువ్వు గొప్ప దేవుడివి' అంటే నవ్వుతాడు. ఆయన శక్తిని చెప్పడానికి 'గొప్ప' అంత చిన్న విశేషణం దొరికినందుకు. లేవండి. మీరు ఆలోచనల్తో, రాత్రి కలలో చాలా అలసిపోయారు" అన్నాడు.

## 6

నాకో వాక్యం గుర్తుకొస్తోంది. రాయలు గురించి ఆలోచించేకొద్దీ - స్త్రీ గురించి ఆలోచించి ఆలోచించి మగాడు పెళ్ళికి సిద్ధపడతాడు. మగాడి గురించి ఏమీ ఆలోచించక హఠాత్తుగా స్త్రీ పెళ్ళికి సిద్ధపడుతుంది. అందుకనే సాధారణంగా మొగాడు ఆశాభంగం చెందుతాడు. సాధారణంగా ఆడది మొగాడితో సరిపుచ్చుకోగలుగుతుంది.

చివరి ఫలితం విషయం ఊహించలేనుకానీ, మొదటి వాక్యం మాత్రం అతని విషయంలో నిజం.

ఆరోజు తర్వాత మళ్ళీ రాయలుని నేను చూడలేదు. ఉదయమే ఎన్నో క్షమాపణలు చెప్పుకుని వెళ్ళిపోయాడు. కలకత్తా వెళ్ళాక ఎప్పుడన్నా గుర్తుకొస్తే ఒకటి రెండు ఉత్తరాలు వ్రాశాడు. వాటికి రాయలు జవాబు వ్రాయడని తెలుసు. వ్రాయడం మళ్ళీ ఒకలంపటం అంటాడు. పెళ్ళికంటే, ప్రేమకంటే ఉత్తరాల బంధుత్వం గొప్పదని అతని థీసిస్ నిజమే; స్నేహంలో ఒక వ్యక్తి తానుగా ప్రదర్శించే గుణాలతో ఒప్పందం, రాజీ, దగ్గరతనం. కానీ ఉత్తరాలలో స్నేహం అంటే అతని ఆలోచనలతో, అతని ఉద్రేకాలతో, అతని లక్ష్యాలతో ఇన్నింటితో బంధుత్వం.

కలకత్తాలో ఉద్యోగం పోవడం, మద్రాసులో మరో పత్రికలో నౌకరీకి కుదురుకోవడం, కుక్కతోక వంపు తిరిగింది అనుకునేలోగా ముడుచుకుపోవడం వంటి సత్యంలాగ జీవితం ఒక గుండుసున్నా అయిదేళ్ళలో తిరిగింది. అప్పటి జీవితానికి అర్థం - పెద్ద జీతం, గొప్పకీర్తి, గొప్ప పదవి అయితే, ఇప్పటి జీవితానికి అర్థం ఓ మంచియిల్లు, కాస్తపాటి ప్రశాంతత, కుటుంబ నియంత్రణ అయింది. అయిదుగురు పిల్లల మధ్య నాలో రచయిత నలిగిపోయాడు. నాలో ఆశావాది విసుగుపుట్టి నిద్రపోయాడు. నాలోని వేనిటీస్ వేటికవి చెదిరిపోయాయి.

ఓ రోజు మద్రాసులో పానగల్ పార్కు చీకటి మలుపు తిరుగుతూంటే ఎవరో సన్నటి వ్యక్తి నా ముందు నుంచి వెళ్ళడం గమనించాను. ఆ చీకటిలో రాయలుని గుర్తించలేకపోయేవాడినే. కానీ అతను పక్క వ్యక్తితో ఏదో చెపుతున్నాడు. "ఇదివరకు రాయలు అంటే కృష్ణదేవరాయలు అని అర్థం. ఇప్పుడు రాయలు అంటే 'రాళ్ళు' అని అర్థం" అంటున్నాడు.

చటుక్కున ఉత్సాహం ఆపుకోలేని గొంతుతో "రాయలుగారూ" అన్నాను. అతను ఆగి వెనకకు తిరిగాడు. కళ్ళు లోతుకుపోయి, నల్లగా వేరులాగ కనిపించాడు. ఇది వరకటి విసురూ, ఉత్సుకత మనిషిలో కొంత తగ్గినట్టు కనిపించింది. ఇదివరకు నవ్వితే బుగ్గలు కాస్త ఉండడంవల్ల కళ్ళు సగం ముడతలుపడినట్టయి చాలా గంభీరంగా కనిపించేది. కానీ యిప్పుడు నవ్వితే పల్చనయిన దవడలు నొక్కులుపడి పళ్ళు తెల్లగా బయటకి కనిపిస్తున్నాయి. నల్లటి ముఖం పాలిపోవడం యిట్లా ఉంటుందేమోననిపించింది. నాకెందుకో ఆశ్చర్యంతో కంఠం త్రొటుపడుతోంది. "రాయలుగారూ, ఇల్లా అయిపోయారేం?" అన్నాను.

పక్కవ్యక్తికి ఏదో చెప్పి పంపేశాడు. వచ్చి నా భుజం మీద చెయ్యివేసినవ్వాడు. "నేనిప్పుడు రాయలుని కాదు రాయిని. ఎన్నాళ్ళకి కనిపించారండీ మీరు!. ఒకటి రెండుసార్లు మీరు కనిపిస్తే బావుణ్ణనుకున్నాను. ఉత్తరం వ్రాయాలంటే అడ్రసు తెలీదు. రామకృష్ణ ఎక్కడో చక్రధరపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడట. అందుకని రాయలేకపోయాను" అంటున్నాడు రాయలు.

నా ఆశ్చర్యానికి అంతులేదు. ఎప్పుడూ ఎంత సాధారణంగా, అందరూ మాట్లాడే ధోరణిలో రాయలు మాట్లాడుతాడనుకోలేదు. "ఏమండీ సార్ మద్రాసు మీకెలావుంది? ఇంత శుభ్రంగా నగరాన్ని ఉంచి కార్పోరేషన్ చెడిపోయింది. పట్టణం ఎంత చెత్తగా ఉండవచ్చో మా శ్రీకాకుళం వాళ్ళని తీసుకువెళ్ళి చూపాలి" అని యిట్లాగ ఏదో మాట్లాడతాడనుకున్నాను కానీ ఇప్పటి భాష, మాట్లాడే తీరు, నవ్వు, కళ్ళలో శక్తి, అంతా వేరు.

"రాయలుగారూ! మీలో మార్పు నాకు చాలా విచిత్రంగా ఉంది" అన్నాను.

"మారకపోతే ఎలాగ చెప్పండి. మనం ఊహించలేనివీ, మనం ఎదురుచూడనివీ చాలా జరిగిపోతాయి ఈ జీవితంలో. కొందరు తట్టుకుంటారు. నాలాంటివాళ్ళకి ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోడానికి ఒక జీవితకాలం వేస్టు అవుతుంది. మీరు కనిపించారు. నాకు చాలా సంతోషంగా వుంది. ఈ పార్కులో కూర్చుందామా?" అన్నాడు.

పెద్ద బాంబు ప్రేలిన తరువాత దారీ తెన్ను తెలీక పరిగెత్తే ప్రజల్లాగ పానగల్ పార్కుముందు ప్రజలు చెదిరిపోతూ, అంతలో కూడుకుంటూంటారు. చాలావరకు స్త్రీలలో నకిలీ అందం చూశాక తరతరాల భారత స్త్రీ సహజ సౌందర్యం మీదా, ఔన్నత్యం మీదా నమ్మకం పోతుంది. అందానికి ఏవో కొన్ని ప్రమాణాలతోనే బ్రతుకుతారు. ఆ సాయంకాలం ఆ ప్రాంతాలలో నడిచే ఏ వ్యక్తిని ఆపి పకలరించినా వీలయితే నూట యాభై ఏళ్ళు బ్రతకాలనుంది అంటాడు. అంత ఆశ, కోరిక జీవితం మీద పెద్ద తెగింపూ, ధైర్యం, మద్రాసులో బ్రతకాలన్న వేనిటీ అక్కడి జీవితానికో వేరే అర్థం.

పార్కులో చీకటి మూల చేరాక లాన్ మీద వెల్లకిలా పడుకున్నాడు రాయలు.

"ఇప్పుడు చెప్పండి? ఎందుకలా అయిపోయారు?" అన్నాను.

అతను నవ్వి "మొదట నా ప్రశ్నలకు సమాధానం చెప్పండి. ఎలా అయిపోయాను? ఇలా అయిపోవటం బాగుందా? ఇదివరకటిలాగా ఉండడంలో ప్రయోజనం ఉందా?" మొదలైనవి.

నాకు నవ్వొచ్చింది ఎంతోసేపు ఆలోచించి అన్నాను. పెద్దపులి పట్టణాల్లోకి సాధువుగా బ్రతకబోతే యెంత ఆశ్చర్యమో, మీరు యిట్లా మామూలూ మనిషికావడం అంతే ఆశ్చర్యం. మొదట పులిగా భయపెట్టిన జంతువు పిల్లిలాగా తయారయాక ఆశ్చర్యాన్ని వదులుకున్న ప్రజలు దాన్ని యెట్లా హింసిస్తారో చెప్పలేను. సంప్రదాయాలమీద విప్లవం చాలా కష్టమైనపనే. కానీ వోడిపోయినట్టు

కనిపించడం మరీ నికృష్టం. అట్లాంటి వ్యక్తి ప్రజల్లో ఎంత లోకువ అవుతాడో చెప్పడం కష్టం. విప్లవంలో విజయం సాధించలేకపోయినా పరవాలేదు. గర్వంగా ఓడిపోవడంలోనే సంతోషం ఉంది. పాత రాయలు సమగ్రమైన వ్యక్తికాకపోయినా, అట్లా ఉండడమే బాగుంటుంది నాకు" అన్నాను.

నా మాటలన్నీ అర్థం చేసుకున్నాడో, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడో తెలియలేదు నాకు. చాలాసేపు మౌనంగా ఉన్నాడు. హఠాత్తుగా కూచుని ఆ చీకట్లో నా రెండు చేతులూ పట్టుకుని "నాకు మీరో సహాయం చేసి పెట్టాలి సార్" అన్నాడు.

"ఏమిటి?"

"నేనిందుకిట్లా తయారయానో మీకిప్పుడు పూర్తిగా అర్థమయిపోతుంది. అట్నుంచి నరుక్కువద్దాం. నేను కోరే సహాయం చెయ్యడానికి సిద్ధమేనా?" అన్నాడు.

"నేను చేయగలిగిందయితే తప్పక చేస్తాను" అన్నాను సందేహిస్తూ.

"మీరు తప్పక చెయ్యగలరు. నాకా ధైర్యం వుంది" అని ఉత్సాహంతో నన్ను లేవదీశాడు. టాక్సీని పిలవబోయి అంతలో ఏదో ఆలోచించి "మనం మాట్లాడుకోవడానికి వ్యవధి వుండదు. ఆలోచనలకంటే వేగంగా ప్రయాణం చేస్తాయి మద్రాసు టాక్సీలు. నడుద్దాం" అన్నాడు, ఎక్కడకని నేనడగలేదు. ఏదో విచిత్రాన్ని చూపుతాడని నాకు ధైర్యం. అందువల్ల కాదనలేదు.

మద్రాసు గొప్పతనం అతనికేమీ పట్టలేదు. చాలా అమూల్యమైన వస్తువులాగా చేతిలో సిగరెట్టును విరామం లేకుండా పీలుస్తున్నాడు. అది పీల్చే రెండు లిప్తల మధ్య ఏ ఆలోచనన్నా తనని భయపెట్టవచ్చునన్న పిరికితనంగావును.

"మీకు తెలుసా, మదర్‌ను నేను పెళ్ళిచేసుకున్నాను" అన్నాడు ఉన్నట్టుండి.

నేనాశ్చర్యపడలేదు. అయిదేళ్ళ కిందటే రాయలు జ్ఞాపకంతో పాటు మదర్ జ్ఞాపకాలు కూడా నిలిచిపోయాయి. ఈ అయిదేళ్ళలో ఎప్పుడన్నా రాయలుకంటే మదరు గురించే ఎక్కువగా ఆలోచించేవాడిని. "అప్పుడే పెళ్ళి చేసుకున్నారుగా!" అన్నాను.

అతను నవ్వాడు "అప్పుడు చేసుకున్నదాన్ని పెళ్ళి అనం. సంఘం సృష్టించిన పదం పెళ్ళి. మనస్సు చేసుకున్న పెళ్ళి పేరు ప్రేమ. కానీ అప్పటిది ప్రేమమాత్రం కాదు. ఫాసినేషన్. ఒక అపురూపమైన వస్తువు మీద కలిగిన ముచ్చట."

"అయితే యిప్పుడు ఆమెను శాస్త్రయుక్తంగా పెళ్ళి చేసుకున్నారన్నమాట.!!"

"**అవును.** *అందరికీ తెలిసేలాగ భార్య కానిదే ఆడదానికి స్థిమితం ఉండదు. మనస్సుకు తెలిసేలాగ పెళ్ళికాకపోతే మగాడికి స్థిమితం ఉండదు. పెళ్ళితో ఒకరికి సమస్య తీరి, మరొకరికి సమస్య ప్రారంభమవుతుంది."*

"ఇప్పుడు ఎక్కడ వుంది మదరు?"

"ఇంకెక్కడ వుంటుంది? పెళ్ళయాక నాతో ఉండడం తప్ప బ్రతకడం తెలీదు మదరుకి. మల్లెపువ్వుకి మంచి సువాసన ఉంటుంది. నిజమే కానీ ప్రతిక్షణం ఆ వాసన భరిస్తూ ఎన్నాళ్ళు బ్రతకగలరు మీరు?" అన్నాడు ఎటువేపో చూస్తూ.

"ఇప్పుడేం?" అన్నాను.

"అంతగా ఆశ్చర్యపడకండి. ఇంకా మరికొన్ని విషయాలు చెపితే అప్పుడిక ఆశ్చర్యపడడానికి ఓపిక మిగలదు మీకు" అన్నాడు, కసిగా సిగరెట్టు పీకను కాలికింద నలుపుతూ.

"మదర్ మీతో సుఖంగా బ్రతకడంలేదా!" అన్నాను ఆతృతని ఆపుకోలేక.

"మదర్‌తో నేను సుఖంగా బ్రతకలేకపోతున్నాను. మొగాడితో సుఖంగా బ్రతకలేని ఆడది ఎట్లాగో ఒక విధంగా సరిపుచ్చుకుంటుంది. కానీ మొగాడు అట్లాకాదు. అక్కడే వుంది ట్రాజెడీ."

"ఏమిటా ట్రాజెడీ?"

నవ్వుతున్నాడింకా "ఏమిటి? రాయలు 'రాయి' కావడం - ప్రణయం, ప్రళయం కావడం" ఆగిపోయాడు. ఇదివరకటి నవ్వుకూ, ఇప్పటి నవ్వుకూ యెంతో తేడా. ఇప్పుడు నవ్వితే సిద్ధాంతాలు, నిర్లక్ష్యం మీద యెంత తప్పించుకోలేని దెబ్బ తగిలిందో తెలిసి గుండె పగులుతుంది. అతని మాటలు వింటూ, కొంతసేపు ఆ నవ్వుని పరికిస్తే రెండు చెవులూ మూసుకుని 'వద్దు వద్దు - నవ్వకండి అలాగ. ఏం మాట్లాడవద్దు' అని అరవాలనిపిస్తుంది. అంత విచిత్రమయిన శక్తి - మరొక రకమయినది - ఆ నవ్వులో ప్రవేశించిందిప్పుడు.

"వివరంగా చెప్పండి. నాకేం అర్థం కావడం లేదు" అన్నాను తొందర తొందరగా.

కళ్ళు మూసుకుని నా భుజం మీద చెయ్యి వేసి నడుస్తున్నాడు. అతన్ని మనుషుల్నుంచి తప్పిస్తూ కాస్సేపు నడిచాను. కళ్ళిప్పి చెప్పమంటారా?"

అన్నాడు.

"ఊఁ."

"మదర్ నా భార్యగా బ్రతకడం లేదు."

"మరి?"

"చెల్లెలిలాగ, అంతకుమించి తల్లిలాగ బ్రతుకుతోంది."

నేను దిమ్మరపోయాను. 'అదేమిటి?'

"అదంతే. మదరు నిజంగానే మదరు. మొదటిరోజే నాకట్లా అనిపించి ఆ పేరు పెట్టానేమో. నా జీవితాన్ని బట్టి నేను సాధించిన నీతి ఏమిటో తెలుసా? ఓ కుక్కతో బ్రతుకు, ఓ నక్కతో బ్రతుకు, కాని తనని గుర్తు చేసే భార్యతో బ్రతకలేరు మీరు."

ఇట్లాంటి వింత సమస్యను ఊహించలేకపోతున్నాను. స్త్రీ అన్ని సందర్భాలలోనూ ప్రేయసి ఎట్లాగూ కాదు. భార్య యింటిలో దాసి, కిటికీ దగ్గర సౌందర్యరాశి, భర్త హృదయంలో రాణి, శయ్యమీద రాక్షసి అని ఆంగ్ల రచయిత వాక్యం అది గుర్తుచేశాడు రాయలు. "మీరు మదరు మీద దురభిప్రాయపడుతున్నారేమో!?" అన్నాను.

"మీరు ఆమె గురించి ఆరుక్షణాలు ఆలోచించారు. నేను ఆరేళ్ళుగా బ్రతుకుతున్నాను. ఆమె 24 గంటలూ నాకు మంచి తల్లి. నా తల్లిని కూడా మరిపించే తల్లి. జీవితమంతా ఒక కొడుకుగా, ఆ వాత్సల్యంతో బ్రతకడమంత నరకం మరొకటి లేదు. మదరుని చూస్తే నేను ప్రేమించాలనుకుంటాను. ఆమెతో పడుకోవాలనుకుంటాను. కానీ ఆమె కళ్ళల్లో నా ప్రతిపని మీద యిచ్చే ఓదార్పు, నా ప్రతిపనిలోనూ నన్ను క్షమించడం, వాత్సల్యాన్ని కురిపించడం, బుజ్జగించడం, నా భుజం తట్టి తలని వొళ్ళోకి తీసుకొనడం, ఇన్ని సాక్ష్యాల తరువాత ఆమె నా భార్యగా ఎట్లా ఊహించుకోగలను చెప్పండి."

"పోనీ ఊహించుకోకండి. ఏం నష్టం ఆమెనట్లా బ్రతకనివ్వండి."

"మీకా బాధ తెలీదు. తల్లి పూజ్యభావానికి కొడుకు ఆమెదగ్గర ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుని భరిస్తాడు. కానీ నా అంత అహంభావికి, ఏవో విప్లవ భావాలతో బ్రతికే నన్ను ఏమీ చదువుకోని ఓ బ్రూట్ వచ్చి క్షమించానంటే యెట్లా వుంటుది? నాలో విప్లవాన్నంతా విని, నవ్వి 'నువ్వు పిచ్చివాడివి. ఎందుకట్లా బాధపడతావు ఆలోచనల్తో, నా వొళ్ళోపడుకో' అంటుంది. ఇక నాకేం

చెయ్యాలో తెలీదు. తల బ్రద్ధలు కొట్టుకోవాలనిపిస్తుంది. తొందరగా తిరిగే ఫాన్‌లో చెయ్యిపెట్టాలనిపిస్తుంది. పెద్ద రాయిని తలమీద పడేసుకుని చచ్చిపోవాలనిపిస్తుంది."

"సైకాలజిస్టుని ఎవరినన్నా కలిశారా? మీ మనస్సులోని లోపమేమో? అది ఆమె యింత పెరగగలదా అని ఆశ్చర్యపడుతున్నాను నేను" అన్నాను.

"సైకాలజిస్టుని కలిశాను. ఆమెను చూపించాను. అది ఆమెలో పెరుగుదల కాదు. ఆమె అట్లాగే బ్రతకడం నేర్చుకుది. చాలా గ్రాండ్‌గా ఉన్న స్త్రీత్వం అది. స్త్రీలో తల్లికావాలన్న ఉద్రేకాలు మిగతా జీవితాల మీద ప్రభావం చూపినప్పుడు ఆ మెటీరియల్ ఇన్‌స్టింక్ట్ ఆధిక్యత వహించినప్పుడు స్త్రీ అట్లా తయారవుతుంది. నన్ను ఒక్క క్షణం వదిలివుండదు. 'నీ కాళ్ళు చూసుకోవడం నీకు తెలియదు' అంటుంది.

'ఇన్నాళ్ళు ఎలా బ్రతికాను నువ్వులేకుండా!' అంటే నవ్వుతుంది.

'అందుకే యిలా పాడయారు మీరు. ఇక పాడవనివ్వను' అంటుంది, తనని వదిలి ఎక్కడకీ పోనివ్వదు. ఒక్కక్షణం దగ్గర లేకపోతే వెయ్యిప్రశ్నలు వేస్తుంది. నేను విసుక్కుంటే ఏడుస్తుంది. ఆమెలో ఏమీ జబ్బులేదని, ఆమె తత్వమే అంతని చెప్పాడు సైకాలజిస్టు."

"ఆమెకు మీమీద ప్రేమ ఉందంటారా?"

"నేను భరించలేనంత ప్రేమ వుంది. కొడుకుని తల్లి ప్రేమించేలాంటి ప్రేమ. మరొక్క విషయం చెప్పేదా? ఆమెతో పడుకోవాలన్నా నాకు ఉద్రేకం కలగదు. తల్లి గుర్తుకొస్తుంది. ఆమే కాదు. ఏ స్త్రీ మీదైనా నాకీభయం ఏర్పడింది. ఏ స్త్రీని చూసినా ఆమెలో నాతల్లి కనిపిస్తుందేమోనని భయపడతాను. ఇదొక మానసికమైన వ్యధ అయిపోయింది నాకు."

నేను నిశ్చేష్టుడినై వినడం ప్రారంభించాను. తల్లి ప్రేమను జీవితమంతా నిరంతరం అనుభవించలేడు మనిషి? స్త్రీతో అటువంటి ప్రేమకూడా ఒక్కొక్కప్పుడు శత్రువు అవుతుందా?

"మదర్ మిమ్మల్ని ప్రేమిస్తుంది. తల్లిలాగ ప్రేమిస్తుంది - ఏ తల్లీ ప్రేమించనంతగా ప్రేమిస్తుంది. అదేనా మీ సమస్య?"

"అవును. అందుకే నేనిట్లా అయిపోయాను. ఇంకేమీ ఆలోచించడం లేదు. మనస్సు ఆ ప్రేమ నన్ను తడిపేస్తోంది. చీల్చేస్తోంది. జీవితం మీదే విసుగు కలిగిస్తూంది. నైరాశ్యం పుట్టిస్తోంది. కసి కలిగిస్తోంది."

రాయలు వేపు చూశాను, అతని కళ్ళు ఎర్రగా దీపకళికల్లా అయాయి. ఏడుస్తున్నాడేమోనన్న అనుమానం కూడా కలుగకపోలేదు.

"అయితే నేనిప్పుడు మీకేం సహాయం చెయ్యాలి?"

"మదర్ మీరు చెప్పినంతమాత్రాన మారుతుందన్న నమ్మకం లేదు. కానీ అంత నన్ను ప్రేమించవద్దని చెప్పండి. నన్ను మరీ కుర్రాడిలాగా బుజ్జగించవద్దనండి. భార్యలాగా, నా కష్టాల్ని మాత్రం పంచుకుంటూ, సామాన్యంగా బ్రతకాలని చెప్పి చూడండి" అన్నాను.

నా మాటలు ఆమెను మారుస్తాయన్న ధైర్యం - ఇంత విన్నాక - నాకూ కలగలేదు. అయితే ఆమెను కలుసుకోవాలన్న ఆసక్తి యేర్పడింది.

"ప్రయత్నిస్తాను" అన్నాను.

ఇద్దరం హోటల్ దగ్గరకి వచ్చాం. గది తలుపు తట్టుతూ మెల్లగా చెప్పాడు రాయలు. "మదర్ పాతవ్యక్తి కాదు. కొంత మారింది. ఆ మార్పు చూసి ఆశ్చర్యపడినట్టు కనిపించకండి."

తలుపు తెరిచిన వ్యక్తివేపు చాలా ఆసక్తితో చూశాను. నిజమే. మదర్‌లో చాలా మార్పు కనిపించింది. నుదుటి నిండా కెంపులాగా మెరిసే బొట్టు. ఎర్రటి చీర, వంటి మీద యెక్కువగా నగల్లేవు - నల్లటి శరీరం మీద పచ్చగా మెరిసే ఓ నెక్లెసు తప్ప. కళ్ళు యిదివరకటిలాగ అజ్ఞానంతో, పట్టుదలతో లేవు. ఏదో అర్థమైనట్టు, దాన్ని నిలుపుకోడానికి ప్రయత్నిస్తున్నట్టు, ఒక తృప్తి, ఒక నిర్లక్ష్యం, కాస్త ప్రశాంతత కనిపించాయి కళ్ళల్లో.

"ఈయన గుర్తున్నారా నీకు?" అని రాయలు అడిగితే యిదివరకటిలాగా మౌనంగా ఉండలేదు. నావేపు చూసి 'లేదు' అంది.

ఆమె గౌరవపురస్కారంగా నమస్కారం చేసింది నాకు. 'కూర్చోండి' అంది. ఈ అయిదేళ్ళలో రాయలు ఆమెను చాలా మార్చాడనిపించింది. ఆమెకు మంచి భాష నేర్పితే బాగుంటుందని యిదివరకు నేననుకున్న ఆలోచన యిప్పుడు అమలు జరిగింది. నేను తప్పుగా ఊహించలేదు - నిజమే. ఆమె కంఠంలో ప్రత్యేకమైన ఆకర్షణ వుంది. కానీ ఆ కంఠం మత్తెక్కించి, ఉద్రేకపరిచేది కాదు. జోకొట్టి నిద్రపుచ్చేది. మాతృభావంలో ఆమె అప్పుడే మాకంటే కొన్ని జీవితాలు ఎదిగిపోయింది. ఆమె వేపే చూస్తున్నాను నేను ఆశ్చర్యంగా. కానీ ఆమెనన్నప్పుడే వదిలిపోయింది. కోటు విప్పుకుంటున్న రాయలు దగ్గరకి వెళ్ళి అతని తలమీద చెయ్యి ఆనించి చూస్తోంది. 'చూశారా మంచులో తిరిగాడు నేను వద్దంటుంటే, జలుబు చేస్తే చిన్నపిల్లాడిలాగా బాధపడతాడు' అంది.

"ప్రపంచమంతా చలికి భయపడి ఆగిపోతే ఇక పనులెట్లా గడుస్తాయి?"

"ప్రపంచం, మీరూ ఒక్కటికాదూ" సంచిలోంచి ఏదో మందు తీసి చెయ్యిపట్టుకుని కుర్చీలో కూలవేసి నుదుటి మీద, ముక్కుదగ్గర, మెడమీద రాస్తోంది. నా వేపు తిరిగి, 'తన శరీరాన్ని తానే జాగ్రత్తగా చూసుకోరండి నాకు భయం' అంది.

ఆమెకు కాస్త విజ్ఞానం కలిగింది కానీ, పూర్తి సంస్కారం కలగలేదు. ఇది మంచి, ఇది చెడు అని తెలుసు. ఆ మంచిని యిప్పుడు చెయ్యాలి, యిప్పుడు చెయ్యకూడదు అని తెలీదు.

నేను నవ్వాను. నిస్సహాయంగా కళ్ళుమూసుకుని రాయలు కూర్చున్నాడు.

"మీకిక్కడ ఎలా గడుస్తుంది?" అన్నాను.

ఆమె నావేపు తిరిగి, 'ఈ హోటల్లో వంట మరీ అధ్వాన్నంగా వుంది. ఇంక రెండు రోజులు ఉండవలసివస్తే దెబ్బలాడయినా నేను వండిపెడతాను. ఈ భోజనం మరి రెండు రోజులు చేస్తే ఆయన ఆరోగ్యం పాడవుతుంది'

"కానీ ఆయన ఇదివరలో చాలా హోటళ్ళలో చాలాసార్లు భోజనం చేశారు."

"అందువల్లనే ఆయన ఆరోగ్యం అలా పాడయింది."

నాకింకేం చెప్పాలో తెలియలేదు. నా మాటలో వ్యంగ్యాన్ని ఆమె గ్రహిస్తుందేమోనని నా ఆశ. కానీ నా మాటల్ని యధాతథంగా భావిస్తూ, సమాధానం చెప్పింది. ఆమె దృష్టి ఎంతసేపూ రాయలు ఆరోగ్యం మీదే

"ఇదివరకు రాయలుగారు చాలా విచ్చలవిడిగా తిరిగారు చాలా వింతగా, విచిత్రంగా వుండేవారు. కానీ యిప్పుడు చాలా మారిపోయారు మీరు వచ్చాక" అన్నాను.

ఆమె నవ్వింది. నా మాటలు విన్నాక అతని జుత్తు ఆప్యాయంగా నిమిరింది. 'నిజం. ఇదివరకంతా ఆయనకి పిచ్చి. ఇప్పుడు చాలా నయం' అంది.

రాయలు ఇంకా కళ్ళు మూసుకునే ఉన్నాడు.

"నాకు భోజనం చేయడం ఎంత చేతకాదో అడగండి" అన్నాడు కళ్ళిప్పి.

ఆమె నవ్వుతూంది. సముదాయింపు, సహనం, ఆ నవ్వుకి అర్థం.

"అవును. ఆయనకసలు భోజనం చెయ్యడమేరాదు. నేను దగ్గర కూర్చోవాలి"

ఆడది క్రమంగా చాలా హక్కుల్ని మగాడి దగ్గర నుంచి కొట్టేస్తుంది. ఆ దొంగిలించడంలో గర్వం కూడా అనుభవిస్తుంది. మొగాడు బ్రతకలేడని, భోజనం తినలేడని, యిట్లా చెప్పడంలో ఆమెకెంతో తృప్తి.

**"ఇవాళ కాఫీ ఎన్నిసార్లు తాగారు?" అంది.**

"నాలుగుసార్లు."

"రెండుసార్లకంటే ఎక్కువ తాగవద్దని చెప్పలేదూ నేను? ఎప్పుడూ నా మాటల్ని లక్ష్యం చెయ్యరు మీరు. మరీ చిన్నపిల్లలకన్నా అల్లరి" అంది.

"పోనీ, రెండుసార్లేనని అబద్ధం యెందుకు చెప్పరు మీరు?" అన్నాడు రాయలుతో నవ్వుతూ.

ఆమెకు కోపం వచ్చింది. నావేపు తిరిగి గర్వంగా అంది. "ఆయనెప్పుడూ అబద్ధం చెప్పరు నా దగ్గర. అబద్ధమని తెలిస్తే పదిరోజులు భోజనం చెయ్యను నేను"

అప్రతిభుణ్ణయి కూర్చున్నాను ఇంకా ఏవేవో అడుగుతోంది అతణ్ణి. "ఎన్ని సిగరెట్లు కాల్చారు?"

"అయిదు"

"మంచి పని చేశారు. కానీ యివాళ నాలుగే కాల్చవలసింది" జేబు వెదికి రూపాయి బయటికి తీసింది. "మరో రూపాయి ఏం చేశారు?" అంది.

"బస్సు టిక్కెట్లకు అర్ధరూపాయి అయింది, రెండు కప్పుల కాఫీ ఆరణాలు. ఒక బేడ దేవాలయం దగ్గర బిచ్చగాడికి యిచ్చాను."

"సరిపోయింది" అని తృప్తిపడింది.

బీదస్థితిలోంచి వచ్చినందువల్ల డబ్బు అంటే కూడిక ఏమో అనుకున్నాను. కానీ అవసరమైన విషయాలకు ఆమె పెట్టే ఖర్చు తనుకూడా చేయలేనని రాయలు అన్నాడు. తరువాత అది డబ్బు మీద సెన్సారీకాదు. అతని అలవాట్లమీద ఆంక్షలు.

"మీరు కాఫీ తాగుతారా?" అంది నన్ను చూసి.

నేనేం మాట్లాడలేదు. బోయ్‌ని పిలిచి ఒక కాఫీ తీసుకురమ్మంది.

"మీరూ, రాయలుగారూ తాగరా మరి" అంటే నవ్వింది. "నేను కాఫీ ఎప్పుడూ తాగను. అందులో ఇవాళ శనివారం. ఏమీ తీసుకోను – ఫలహారం తప్ప. ఈ హోటళ్ళలో ఫలహారం తినేకన్నా మానెయ్యడం నయం."

నేను నివ్వెరపోయాను. ఈమె పాతస్త్రీల జాబితాలో చేరుతుందో, ఆధునిక యువతుల వరుసలో నిలుస్తుందో తేల్చుకోలేకపోయాను మంచి చీరకట్టుకుని, బొట్టుపెట్టుకుంది. కానీ వీటి మీద ప్రత్యేకమైన ఆసక్తి ఉన్నట్టు కనిపించదు. రాయలుని తృప్తిపరచడానికి అట్లా తయారయి ఉంటుంది. కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే అయిదేళ్ళ క్రిందట నిర్లిప్తంగా వుండే తమ్మిఛాయలు ఆమెలో ఏమూలో కనిపిస్తాయి.

అతని పనులకు అడ్డురాదు. తనా అలవాట్లకు లోనుగాదు – అయితే అతని ఆరోగ్యం పాడవనివ్వదు. హెచ్చు ఆలోచించనివ్వదు. మరి అటువంటి స్త్రీ అండగా వుండడం అదృష్టమేమో అనుకున్నాను.

*రచయితకి మనస్సులో ఒక స్త్రీ పక్కన ఒక స్త్రీ వుంటే మంచి కవిత్వం వస్తుంది. మామూలు వ్యక్తికి పక్కన్న ఒక స్త్రీ ఉంటే చాలు.*

"నాకూ తాగాలని వుంది మదర్" అన్నాడు రాయలు బలహీనంగా.

"వద్దు. మీరు తాగడానికి వీల్లేదు - ఇప్పటికి నాలుగుసార్లు తాగారు. ఇంకా తాగితే గుండెకు మంచిదికాదు" అంది కఠినంగా.

అంతవరకు తట్టుకున్న రాయలు యిక ఆగలేకపోయాడు. కళ్ళప్పటికే ఎర్రబడ్డాయి. ఒక్కసారి జుట్టుపీక్కుని లేచి నిలబడ్డాడు. 'వొంటికి మంచిదికాదు - మంచిదికాదు - నీ జాగ్రత్తలో నన్ను చంపేస్తున్నావు. అంత నాగురించి నాకు తెలియని వెధవనా నేను. అబ్బబ్బబ్బబ్బ - నరకం, నరకం నీతో బ్రతుకు - ఛీఛీ' అనుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. నేను గొంతెత్తి పిలవబోయేలోగా మెట్లుకూడా దిగిపోయాడు.

ఆమె ముఖం కాస్త ఉదాసీనతతో ఎర్రబడింది కానీ హెచ్చు చలించలేదు ఎదురుగ్గా వున్న కుర్చీలో కొంగు వొంటి చుట్టూ తిప్పుకుని కూచుంది. నా దిగ్భ్రమనీ, భయాన్నీ గమనించి పేలవంగా నవ్వుతూ అంది.

"భయంకాదులెండి ఆయనకి అట్లా కోపం వస్తూంటుంది అంతా చిన్నపిల్లలకోపం నన్నొదిలి యెక్కడికీ పోలేరు మళ్ళీ వెంటనే వచ్చేస్తారు" అంది.

"పోనీ కాఫీ తాగనివ్వకూడదా?"

"మీకు తెలీదు. తాగితే భోజనం చెయ్యలేరు. ఇక మర్నాటికి కళ్ళు చింతనిప్పుల్లా అవుతాయి. చలికాలంలో జలుబు చేస్తోంది. సిగరెట్లు యెక్కువ కాలుస్తారు వెంటనే మలేరియా వస్తుంది" అంది ఒక్క గుక్కలో.

రాయలు ఆరోగ్యాన్ని ఇన్నాళ్ళూ ఎంతగా పరిశోధించిందో ఆమె మాటల్లో అర్థమయింది. కానీ జీవితమంతా ఇంత మంచి తల్లి దగ్గర, నర్సు దగ్గర ఆసుపత్రిలాగ చేసుకు గడపడం, అబ్బా! ఎంత పెద్ద శిక్ష.

"మీరిట్లా ప్రతివిషయం మీదా నిర్బంధం చేస్తే అతను బాధపడుతున్నాడు" అన్నాను చివరికి.

"నిర్బంధాలు చెయ్యకుండా చూశాను. కానీ అప్పుడూ లాభంలేదు. నేను ఆయన పనులు వేటికీ అడ్డురాను - యెందుకంటే నాకంత తెలివిలేదు. ఏమీ చేతకాదు. కానీ ఆయన చేసే ప్రతిపనీ తప్పే - తప్పు చేశారని చెపితే మరీ బాధపడతారు. అందుకని చెప్పను. మరిచిపోయేటట్టు చేయడానికి బుజ్జగిస్తాను. అది ఆయనకు నచ్చదు. అంత వింత మనస్సు ఆయనది."

నాకేం చెప్పాలో తోచలేదు. ఇంత 'రీజన్' ఆమె సిద్ధం చేసుకున్నాక మారమని ఆమెకెట్లా నచ్చచెప్పాలో తోచలేదు. అయినా యివి కుటుంబ వ్యవహారాలు. నేను తల దూర్చడం నాకే బాగులేదు.

"మీరు పాతమనిషిగా ఉంటేనే బాగుందన్నారు ఆయన."

"నేనేం మారలేదే నేను యెక్కువ చదువుకోలేదు. నాకేమీరాదు. ఆయనకి నచ్చినట్టు వండడం బాగావచ్చు. ఖరీదయిన బట్టలు కొనమని ఆయనని ఎన్నడూ బాధపెట్టను. నాకూ అక్కరలేదు. ఎప్పుడూ యీమాటే ఆయనతో చెప్తాను."

"అది కాదు" అని ఆగిపోయాను. రాయలు నాతో అన్న విషయాన్ని ఆమెకు ఎలా వ్యక్తం చేయాలో అర్థం కావడంలేదు. ఎలాగో మాటల్ని కూడదీసుకుంటూ "మీరు అతన్నట్లా బుజ్జగించకూడదు మీ భర్త కదా? అతనిని గౌరవించాలి."

"నాకు గౌరవంలేదని యెవరన్నారు ఆయన చెప్పారా?"

"అబ్బెబ్బే! అదేంలేదు - మరీ చిన్నపిల్లాడిలాగా చూడకూడదని నేనే అంటున్నాను."

ఆమె పక్కున నవ్వింది - "నేను చూడడమేమిటి? ఆయన చిన్నపిల్లాడే - చూడండి. ఇప్పుడిప్పుడు ఎలా కోపం తెచ్చుకు వెళ్ళిపోయారో. అలా చూస్తూండండి - క్షణంలో మళ్ళీ నవ్వుతూ వస్తారు" అంది.

నేను మాట్లాడలేకపోతున్నాను. నా శక్తినంతటినీ వినియోగించి అసలు విషయం చెప్పదలచుకున్నాను.

"అతనికి మీరు తల్లికాదు. భార్య" అన్నాను. ఆమె తెల్లబోయింది. `అంటే` అంది.

"నా ఉద్దేశం భార్యగా అతని దృష్టిలో వుండాలని. మంచి తల్లిలాగా అతనికి మీరిప్పుడు కనిపిస్తున్నారు."

"మీకెందుకలా అనిపించింది?"

"మీరాయనికి చేసే సేవల్లో."

"భార్య అలా చెయ్యకూడదా? అతని కష్టాల్ని భార్య తీర్చదా యేమిటి? తీర్చకపోతే యెందుకూ ఆ భార్య. నేను భార్యని కాదని మీరంటే నాకేం పర్వాలేదు. నేనిలాగే వుంటాను. ఆయనకే యిబ్బందీ కలుగకూడదు. అదే నాక్కావాలి" అంది నిర్ధారణగా. అప్పటి ఆమె పట్టుదల, కళ్ళల్లో ఎరుపూ చూసి నోరు మెదపలేకపోయాను.

ఇప్పుడు జేబుల్లో చేతులు పెట్టుకుని క్రిందనుంచి వచ్చాడు రాయలు, "మూడు కప్పులు కాఫీతాగి వచ్చేశాను. ఇప్పుడు హాయిగా ఉంది నాకు" అంటూ.

ఆమె కోపం తెచ్చుకుంటుందనుకున్నాను. కానీ పకాలున నవ్వింది. నావేపు తిరిగి "చూశారా? ఎట్లాంటిపని చేశారో? ఈయన పెద్దవాడని యెట్లా అనుకోను. ఇక ఈ రాత్రంతా, జలుబుతో నిద్రలేకుండా కూర్చుంటారు" అంది. ఆమెలో కోపంలేదు కొడుకు ఓ విగ్రహాన్ని పగలగొడితే, ఆ విగ్రహం విరిగిపోయిందన్న కోపంకాక, కొడుకు అంతపని చేయగలిగాడన్న ఓ వింత సంతోషం అనుభవించిన తల్లిలాగ కనిపించింది మదర్.

"రాయలు చాలా వింతమనిషి ఒకప్పుడు. కానీ అతనికి ఒక వింతభార్య దొరికాక, ఆయనలోని విచిత్రం పోయి, ఇద్దరి బ్రతుకుల్లో విచిత్రం ప్రవేశించింది" అని లేచాను.

"నేను అతన్ని దిగబెట్టివస్తాను" అన్నాడు రాయలు.

"మీకు భోజనం వేళయింది. మీరు వెళితే మళ్ళా త్వరగా తిరిగిరారు. ఆయన రేపు మళ్ళా వస్తారు" అంది.

రాయలు నిస్సహాయంగా కనిపించాడు. ప్రతివిషయంలోనూ యెదిరించడానికి ప్రయత్నించి అలసిపోయాడని, అతని ముఖం చూస్తూ గ్రహించాను. `రేపు తప్పక వస్తారుగదూ?` అన్నాడు.

తల వూపి బయలుదేరాను.

ఇప్పుడు రాయలు అనుభవిస్తున్న రోగం ఏమిటో అర్థమయింది. దీనికి చికిత్స ఏమిటా అని ఆలోచిస్తూ నడిచాను. ఆలోచిస్తున్నకొద్దీ అతనిమీద జాలి ఎక్కువయింది.

## 7

మర్నాడు సాయంకాలం హోటల్‌కు వెళితే ఉదయమే వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారని తెలిసింది. రాత్రంతా రాయ్ ఏదో అస్వస్థతతో బాధపడ్డాడని పాలు తీసుకొచ్చి వాళ్ళకిచ్చిన కుర్రాడు చెప్పాడు. ఇక ఉదయం అతను ఉండాలన్నా వినకుండా ఆమె ప్రయాణానికి సిద్ధం చేసిందట.

ఆ తర్వాత మరి రాయలునీ, మదర్‌ని నేనెన్నడూ చూడలేదు.

పదేళ్ళ తర్వాత రాయలు కనిపించి "నేనింకా బ్రతికే ఉన్నానండీ - నా విప్లవంతో" అన్నా ఆశ్చర్యం కలిగేదికాదు. కానీ ఈ రాయలు అట్లాకాదు, రెండేళ్ళ క్రిందటి నుంచీ కొద్దికొద్దిగా చచ్చిపోవడం ప్రారంభించి ఇప్పుడిక పూర్తిగా చచ్చిపోయాడనిపించింది.

గంటకు నూట ఇరవై మైళ్ళ వేగంతో పోయే మోటారు సైకిలు విషయం నాకారోజు హోటల్‌లోనే చెప్పాడు. "జీవితాన్ని వెనక్కి తిరగడానికి వీలులేనంత వేగంతో గడపాలని నాకోరిక. అట్లా గడపలేకపోతున్నానన్న ఆలోచన కలిగినప్పుడు కనీసం ఈ వేగాన్నయినా అనుభవించడానికి సిద్ధంచేశాను మోటార్ సైకిలుని. దానికోసం రెండేళ్ళు పరిశ్రమ చేశాను" అన్నాడు.

మానసికంగా చచ్చిపోయిన రాయలుని గురించి ఎక్కువ ఆలోచించలేదు. కానీ ఒక గొప్ప పాత్ర చివరకి చేతకానిదయినప్పుడు, నవలలో ముగింపులేని కథానాయకుడి మీద రచయిత జాలిలాంటిది రాయలు మీద ఏర్పడింది నాకు. మదర్‌ని కలవకపోతే అతని జీవితం ఎట్లా ఉండేదా అని ఊహించ ప్రయత్నించాను. కానీ లాభం లేకపోయింది. మరొక రాయలు ఆ కొత్త కథని నడపవలసిందే. కొన్ని సత్యాలు ఊహకందనంతగా పెరిగిపోతాయి.

చాలా ఏళ్ళ తరువాత రామకృష్ణనుంచి ఓరోజు ఉత్తరం వస్తే పెద్దగా ఆశ్చర్యపడలేదు నేను. రాయలు చచ్చిపోయాడు - అని రాశాడు.

ఇప్పుడేం? ఎన్నాళ్ళు అయింది రాయలు చచ్చిపోయి - అని సంజాయిషీ చెప్పింది మనస్సు.

ఎలా చచ్చిపోయాడో వ్రాశాడు రామకృష్ణ.

మరి వారానికి పాత అడ్రసులన్నీ తిరిగి ఓ కవరు నాకు చేరింది. రాయలు మరికొన్ని గంటల్లో చచ్చిపోతాడనగా నాకు రాసిన ఉత్తరం. రాయలు నాకు రాసిన మొదటి, చివరి ఉత్తరం అదే.

"రచయితగారూ! -

మిమ్మల్ని కలుసుకోవాలని ఆరోజు తరువాత మళ్ళీ చాలాసార్లు అనిపించింది. ఆనాడు మిమ్మల్ని కలవడం కోసం నా అనారోగ్యాన్ని దాచుకోవాలనుకున్నాను. కానీ మదర్ ముందు అదేం దాగలేదు.

మీతో ఓసారి అన్నాను - చేవ ఉంటే మనమే మన చావును నిర్ణయించుకోవచ్చునని. నాలో పాత 'రాయలు' ఇంకా ఆ ధైర్యాన్ని దాచుకున్నాడు. ఆనాడు మిమ్మల్ని పాత 'రాయలు' ఇప్పటి 'రాయలు' మీద తిరుగుబాటు చేస్తూ వచ్చాడు. చివరికి పాత రాయలే జయించాడు.

నన్ను ఎప్పటికీ, ఎన్నటికీ, ఎక్కడికీ వదిలిపోలేని మదర్‌కూ, నాకూ మంచి గమ్యాన్ని నిర్ణయించుకున్నాను నేను. మీకీ ఉత్తరం అందేసరికి శ్రీకాకుళంకి 20 మైళ్ళదూరంలో వున్న కొండలోయల్లో నా మోటారు సైకిలుతోపాటు యిద్దరి శరీరాలు విడిభాగాలూ అక్కడక్కడా దొర్లుతాయి. ఈ పదేళ్ళలో చచ్చిపోవాలన్న ఆలోచన వచ్చినప్పుడు కలిగిన 'రిలీఫ్' ఎన్నడూ కలగలేదు. నేను భీష్ముణ్ణి. నేను కోరుకున్నప్పుడు చచ్చిపోగలుగుతున్నాను. నా జీవితానికి నీతి. ***హెచ్చు ప్రేమించకు - జీవితాన్నిగాని, విప్లవాన్నిగాని, నిన్నుగాని, హెచ్చు ప్రేమను ఆశించకు - తల్లినుంచి కాని, భార్యనుంచి కాని. మితిమించిన కోరికలాగా, మితిమించిన ప్రేమా మనిషిని కాల్చేస్తుంది.***

నమస్కారం.

ఇట్లు
మీ 'రాయలు'

ఉత్తరం చదివాక రక్తంలోని ప్రతి అణువూ పాత మిత్రుడి కోసం పలవరించింది. అతన్ని ఆపుజేయడానికి అవకాశాలన్నింటినీ అతనే బంధించి ఈ ఉత్తరాన్ని పంపాడు నాకు. మనస్సు వెయ్యి గొంతులతో కనిపించని ఆ మిత్రుడికోసం రోదించింది.

"భగవాన్! ఎందుకు సృష్టిస్తావు యిట్లాంటి వాళ్ళని? ప్రపంచపు వైపరీత్యాన్ని చూసి నువ్వుచేసే చిరునవ్వుకి సాక్ష్యమా వీళ్ళు?" అనుకున్నాను.

*(సమాప్తం)*